ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుండి 8.30 వరకు
సా.4 గం.నుండి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుండి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 92 | బుధవారం 31 డిసెంబర్ 2025 | పేజీలు - 10 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

### ఆంధ్రప్రదేశ్ కొత్తజిల్లాల తుది

# నోటిఫికేషన్

**కొత్త జిల్లాలతో 28కి పెరిగిన జిల్లాల సంఖ్య**

**ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి**



**అమరావతి, డిసెంబర్ 30 :**

రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇక రాష్ట్రంలో 5 కొత్త రెవెన్యూ డివిజన్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పులు జరిగాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లి మారనుంది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరిపాలన, రెవెన్యూ కార్యకలాపాలు మరింత సమర్ధవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకున్నదని (మిగతా 2లో)



### మార్కెట్ శక్తులకు అనుకూలంగా

# ప్రభుత్వ విధానాలు

- అధికారంలో ఏ ప్రభుత్వం వున్నా రైతన్నలపై సవతి ప్రేమే...
- డిమాండ్ ఆధారిత పంటలు సాగుచేయాలంటారు..
- కానీ ఏ పంటనూ గిట్టుబాటుతో కొంటామని చెప్పరు..
- ఆక్వా కల్చర్ సాగు 2 లక్షల హెక్టార్లు, 5 లక్షల హెక్టార్లు పెంచాలన్నారు..
- ట్రంప్ సుంకాల దెబ్బకు రొయ్యల సాగుకు తీవ్రమైన సంక్షోభం..
- దిగుమతి సుంకాలు తొలగించడంతో పత్తి రైతు దివాళా....

**అమరావతి, డిసెంబర్ 30 :**

కేంద్రంలో, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అన్నదాతలపై ప్రభుత్వాలది సవతి ప్రేమే.. ఒకప్పుడు కాంగ్రెస్, కొన్నేళ్లుగా టీడీపీ, గతంలో వైసీపీ ఇలా ఏప్రభుత్వం అధికారంలో వున్నా మార్కెట్ శక్తులకు అనుకూలగా వ్యవహ రించారు తప్పా ఏ ఒక్క ప్రభుత్వం కూడా రైతన్నలకు అనుకూలంగా వ్యవహ రించకపోగా మాయమాటలతో కొన్ని దశా బ్దాలుగా బురిడీ కొట్టిస్తూనే వున్నారు. ఆ పంటకు డిమాండ్ వుందీ, ఈ పంట సాగుచేస్తే లాభాలు అధికం అని ఉచిత సలహాలు ఇవ్వడం తప్పా సాగుచేసే పంటలకు గిట్టుబాటు ధరలతో మార్కెటింగ్ సదుపాయం మేం కల్పిస్తామని చెప్పిన నాథుడే లేడు. అందుకే రైతన్నలు అలసిపోతున్నారు. పంటల్లో అధిక దిగుబడులొచ్చాయని సంతోషించేలోపే మార్కెట్‌లో ధరలుండవు. రైతన్నలు సాగు చేయకుండా వుండే పంటలకు మాత్రం అధిక ధరలు చూపిస్తారు. మా ప్రభుత్వహయాంలోనే రైతన్నలకు అత్యధిక లాభాలు చేకూరాయని, అందుకోసం మా ప్రభుత్వమే అవసరమైన చర్యలు తీసుకుందని ఏ ప్రభుత్వమైనా ముందుకొచ్చి వాస్తవాలు చెప్పగలదా..? అధికారంలోకి రావాలనకునే ముందు ప్రతి నాయకుడూ రైతు జపం చేస్తారు. అధికారంలోకి వచ్చాక రైతన్నలు చచ్చారా.. బతికారా అనేది కూడా పట్టించుకోని దౌర్భాగ్యస్థితిలో కొట్టుమిట్టా డుతున్న దుస్థితి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా డిమాండ్ ఆధారిత పంటలు పండించాలని చెప్తున్నారు. అయినా ఏ పంట పండించినా కొంటామన్న గ్యారెంటీ ఇవ్వలేదు. కర్నూలులో ఉల్లిరైతులు, చిత్తూరులో మామిడి రైతులు చిత్తయినా ఆదుకునే ప్రయత్నం చేయలేదు. మాటలతోనే సరిపుచ్చారు. గత ఏడాది ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో రాష్ట్రంలో ఆక్వా కల్చర్ సాగు 2 లక్షల హెక్టార్ల నుండి రాబోయే కాలంలో 5 లక్షల హెక్టార్లు పెంచాలని సూచించారు. ఆంధ్రా ఫిష్-ఆంధ్రా ఫుడ్-గుంటూరు మిర్చి తదితర బ్రాండ్లకు మంచి డిమాండ్ వస్తుందని పేర్కొన్నారు. ట్రంప్ సుంకాల దెబ్బకు రొయ్యల సాగు తీవ్రమైన సంక్షోభంలో పడిపోయింది. రొయ్యల రైతులను ఆదుకోవడానికి తీసుకున్న చర్యలు ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. గుంటూరు మిర్చి, చిత్తూరు మామిడి పల్ప్ ఎగుమతులు దిగజారిపోయాయి. దిగుమతి సుంకాలు తొలగించడంతో పత్తి రైతు దివాళాకు దారితీసింది. డిమాండ్ ఆధారిత పంటలుగా రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలని, వాటికి డిమాండ్ వస్తుందని చెప్తున్నారు. ఒకవైపు ముతక బియ్యం కొనకుండా ప్రజలంతా సన్నబియ్యం అడుగుతున్నారని చెప్తున్నారు. ముతక ధాన్యాలకు ఎక్కడ నుండి డిమాండ్ వస్తుందో తెలియడం లేదు. అన్నదాతలు పంటలు మార్చిడి పాటించాలని చెప్తున్నారు. అలాంటి ప్రణాళిక ప్రభుత్వం వ్యవసాయ శాఖ రూపొందించాలి. రైతుకు ఏ పంటకు సరైన ధర (మిగతా 2లో)

### తిరుమల కొండపై మార్మోగిన

# గోవింద నామ స్మరణం

- శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ సిఎం, రాష్ట్ర మంత్రులు..
- అర్ధరాత్రి నుంచే మొదలైన దర్శనాలు..
- తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి...



**తిరుమల, డిసెంబర్ 30 :**

తెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం (మిగతా 2లో)

### శ్రీవారిని దర్శించుకున్న

# వైసీపీ ప్రముఖులు



**తిరుమల, డిసెంబర్ 30 :**

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల శ్రీవారిని వైసీపీ ప్రముఖులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయాన్నే పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి తమ కుటుంబీకులతో కలసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ తలశిల రఘురాం, టి.డి.క్రిష్ణసుమన్ (కిట్టు) రెడ్డిలు కూడా శ్రీవారి దర్శనం చేసుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు.

# మాటిచ్చా..నెరవేర్చుతున్నా

- కోనసీమ అభివృద్ధే లక్ష్యమంటున్న పవన్ కళ్యాణ్ ...
- శంకర్ గుప్తం మురుగు కాల్వ పూడికతీతకు శంకుస్థాపన..
- రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం..



**అమరావతి, డిసెంబర్ 30 :**

కోనసీమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కేసనపల్లి తుఫాన్ సెంటర్‌లో శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాలువకు సంబంధించిన ఎనిమిది కిలోమీటర్లు పొడవునా పూడికతీత పనులు,14.5 కిలోమీటర్ల పొడవునా గట్ల పటిష్టత పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునీకీకరణ పనులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వర్చువల్‌గా హాజరయ్యారు. కోనసీమ కొబ్బరి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.20.77 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులకు పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. ఇటీవల రాజోలులో తన పర్యటన సందర్భంగా (మిగతా 2లో)

# గుర్తింపు కార్డు వద్దులే

- మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి గుర్తింపు కార్డు అవసరమా..
- దానివల్ల కండక్టర్లపై పెరుగుతున్న ఒత్తిడి..
- గుర్తింపు కార్డు చూపడం వల్ల ఎటువంటి లాభమూ లేదు..



**తిరుమల, డిసెంబర్ 30 :**

మహిళలకు ఉచిత బస్సు అందిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయాణాలు చేసేటప్పుడు గుర్తింపు కార్డు చూపించాలనే నిబంధన పెడుతున్నాయి. అయితే ఏ రాష్ట్రం బస్సులో ఆ రాష్ట్రంలోనే ఎక్కువగా తిరుగుతాయి. అలాగే అందులో ప్రయాణించే మహిళలకు కూడా సాధారణంగా ఆ రాష్టానికి చెందిన వారే ఉంటారు. అటువంటప్పుడు వారికి బస్సుల్లో ఉచిత ప్రయాణాలకు గుర్తింపు కార్డులు చూపించాలనే నిబంధన అవసరమా అనే చర్చ జరుగుతోంది.ఇదే క్రమంలో ఆంధ్రప్రదేశ్ లోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు అందిస్తున్న స్త్రీ శక్తి పథకం అమల్లో భాగంగా గుర్తింపు కార్డులు చూపించి ప్రయాణాలు చేయాలనే రూల్ పెట్టారు. అయితే దీని వల్ల అదనంగా ప్రభుత్వానికి కలుగుతున్న లాభం అంటూ ఏమీ లేదు. కానీ ఆర్టీసీ ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందట. ఇదే విషయాన్ని తాజాగా ఆర్టీసీ ఉద్యోగ సంఘం ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాలు చేస్తున్న మహిళల్లో పెద్దగా ఇతర రాష్ట్రాల వారు లేకపోవడంతో గుర్తింపు కార్డులు చూపించాలనే నిబంధన తీసేయాలని ఈయూ నేతలు తాజాగా సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి (మిగతా 2లో)

### బంగ్లా చొరబాట్లను

# ప్రోత్సహిస్తున్న మమత

**కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సిఎం**

**ఘాటు విమర్శలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షా**



**కోల్‌కత్తా, డిసెంబర్ 30 :**

భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను (మిగతా 2లో)

# పెన్షన్‌దారులపై మరో సర్వే

- ఇప్పటికే పెన్షన్ అనర్హులను తొలగించిన ప్రభుత్వం..
- వైసీపీ విమర్శలకు చెక్ పెట్టేందుకు ఐవీఆర్ఎస్ విధానంలో సర్వే..
- పెన్షన్‌దారులతో నేరుగా మాట్లాడనున్న ప్రభుత్వం..



**అమరావతి, డిసెంబర్ 30 :**

ఏపీలో గత వైసీపీ హయాంలో ఇచ్చిన పెన్షన్లను భారీగా పెంచడంతో పాటు లబ్దిదారుల సంఖ్యను కూడా పెంచి కూటమి సర్కార్ ప్రతీ నెలా పంపిణీ చేస్తోంది. క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీ లో భాగంగా అనర్హుల్ని గుర్తించి ఇప్పటికే తొలగించింది. అయినా ఇంకా అనర్హులు ఉన్నారనే చర్చ జరుగుతూనే ఉంది. మరోవైపు వైఎస్సార్సీపీ అకారణంగా పెన్షన్లను తీసేస్తున్నారనే చర్చను తెరపైకి తెస్తోంది. దీంతో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.ఏపీలో కూటి ప్రభుత్వం భారీగా పెన్షనర్లను జాబితా నుంచీ తొలగించిందని, చాలా మందికి పెన్షన్ ఇవ్వట్లేదనీ జరుగుతున్న ప్రచారాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఐవీఆర్ఎస్ విధానంలో మరో సర్వే నిర్వహించేందుకు సిద్దమైంది. ఈ సర్వే లబ్దిదారుల గుర్తింపు కోసమో, తొలగింపు కోసమో కాదు. ప్రస్తుతం పెన్షన్లు అందుకుంటున్న లబ్దిదారులకు నేరుగా కాల్స్ చేసి వారిని నిర్ధారించుకోవడం, పెన్షన్లు ఎలా అందుతున్నాయో తెలుసుకోవడం, వైసీపీ ప్రచారలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా జరగనుంది.ఈ మేరకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ దారులకు ప్రభుత్వం నుంచి కాల్ వస్తుంది. అందులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ఎలా (మిగతా 2లో)

# మార్కెట్ శక్తులకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు

(మొదటి పేజి (తరువాయి)

కల్పిస్తామని హామీ ఇస్తే ఆ పంట సాగు చేస్తారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలు మార్కెట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయి. రైతు ఏ పంట పండించినా తిమ్మిని బమ్మిని చేయగలిగిన మార్కెట్ శక్తుల చేతిలో పెత్తనం ఉంది. సుబాబుల్ కర్ర 10 సంవత్సరాలపాటు మార్కెట్ కమిటీల అజమాయిషీలో ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం రాగానే ఆ వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్టర్ల వ్యవస్థను ఏ జిల్లాకు ఆ జిల్లా ధర నిర్ణయించే విధానం ప్రవేశపెట్టారు. సుబాబుల్ రైతాంగం తోటలు పీకివేసుకోవాల్సి వచ్చింది. పంటలను లాభదాయకమైన ధరకు కొనడానికి గ్యారంటీ చట్టం చేయాలని డా॥స్వామినాథన్ చెప్పారు. ఆ చట్టం చేయకుండా ఎన్ని కబుర్లు చెప్పినా రైతు మార్కెట్ మాయాజాలం నుండి బయటపడలేదు. పంటలకు విలువ పెరగాలంటే ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, 38 ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సిఐఏ సదస్సులో ఎంఓయులు కుదుర్చుకున్నామని, 13 వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని చెప్పారు. ఎంఓయులు కుదుర్చుకోవడం 2000 సంవత్సరంలోనూ, 2015 లోనూ చూశాం. ఎన్ని వచ్చాయో రివ్యూ లేదు. కొత్తగా వస్తాయి అని చెప్తున్నారు. మూతపడి ఉన్న వాటి గురించి మాట్లాడటం లేదు. ఒకప్పుడు రాష్ట్రంలో చక్కెర పరిశ్రమ ప్రధానమైనదిగా ఉండేది. నేడు 29 ఫ్యాక్టరీలకుగాను 3 మాత్రమే నడుస్తున్నాయి. 2015లో చక్కెర పరిశ్రమపై వేసిన చౌదరి కమిషన్ నివేదిక బయటపెట్టలేదు. సహకార రంగంలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఉండగా, మన పౌర సరఫరా శాఖ తెలంగాణ రాష్ట్రం నుండి పంచదార కొంటుంది. ప్రభుత్వం అజమాయిషీలో ఉన్న తిరుపతి దేవస్థానం కర్ణాటక నుండి చక్కెర కొంటుంది. మన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగం అన్నా, సహకార రంగం అన్నా గిట్టదు. ఫ్యాక్టరీలను ప్రైవేటు వారికి అప్పగించిన కీర్తి గడించింది. సహకార బియ్యపు మిల్లులన్నీ మూత వేయించారు. పాడి రైతులు అభివృద్ధి గురించి చెప్పారు. రాష్ట్రంలో మూతబడి ఉన్న మూడు డెయిరీలను తెరిపించే చర్యలు లేవు. ఇప్పుడు ప్రతి నియోజకవర్గానికి ఒక ఫుడ్ ప్రాసెసింగ్ కారిడార్ అంటున్నారు. అవన్నీ కాగితాలకు పరిమితం కాకుండా ఉండాలి. నీటి భద్రత గురించి చెప్పారు. అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన సాగునీటి పత్రంలో గోదావరి బనకచర్ల ప్రాజెక్టు గురించి పి.పి.పి పద్ధతిలో సాగునీటి వ్యవస్థను సంస్కరిస్తామని చెప్పారు. సాగునీటి రంగంలో గేమ్ చేంజ్ అవుతుంది అని చెప్పారు. ఇవన్నీ ప్రైవేటుకు అప్పగించే చర్యలే. నీటి మీటర్లు బిగించి ప్రతి నీటి బొట్టుకు చార్జీ వసూలు చేస్తారు. మన రాష్ట్రానికి శక్తివంతమైన ఇరిగేషన్ వ్యవస్థ ప్రభుత్వానికి ఉన్నది. దానిని వదిలేసి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పచెప్పడం రైతులకు శ్రేయస్కరం కాదు.

# బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత



(మొదటి పేజి (తరువాయి)


ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

# శ్రీశైలంలో ముక్కోటి ఏకాదశి దర్శనాలు

## పలురు ప్రముఖుల రాక

## చెంచు గిరిజనులకు ప్రత్యేక దర్శనాలు అమలు

**శ్రీశైలం, డిసెంబర్ 30 :**



:వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు భారీగా తరలి వచ్చి శ్రీశైలం మల్లన్నను దర్శించుకుంటున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు కూడా స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం పాలకమండలి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయ పాలకమండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. చెంచు గిరిజనులకు ఉచితంగా స్పర్శ దర్శనం అందించే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించింది. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేశ్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రత్యేక దర్శనంలో భాగంగా సుమారు 100 మంది చెంచు గిరిజనులు మల్లికార్జునస్వామిని స్పర్శ దర్శనం చేసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా చెంచు గిరిజనులతో విడదీయరాని అనుబంధం ఉంది. శ్రీశైలం అరణ్య ప్రాంతంలో నివసించే చెంచులు ఆదికాలం నుంచి ఈ క్షేత్రానికి సంరక్షకులుగా, సేవకులుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. వారి సంప్రదాయాలు, ఆచారాలకు గౌరవంగా ఆలయ పాలక మండలి ఈ నిర్ణయం తీసుకోవడం భక్తుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్ రమేశ్‌నాయుడు మాట్లాడారు. చెంచు గిరిజనులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలలో ఒకరోజు వారికి ఉచితంగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆలయ మొదటి పాలక మండలి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

ఈ క్రమంలో చెంచు గిరిజనులు ఈ అవకాశాన్ని దేవుడి వరంగా భావిస్తూ, దేవస్థానం పాలకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఇంతకాలంగా ఉన్న కోరిక నెరవేరిందని భావోద్వేగంగా స్పందించారు. శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో చెంచు గిరిజనులకు ఉచిత స్పర్శ దర్శనం ప్రారంభం కావడం ఒక చారిత్రక నిర్ణయంగా నిలిచింది. ఇది సంప్రదాయానికి, సమానత్వానికి, గిరిజన సంక్షేమానికి ప్రతీకగా నిలిచింది. భవిష్యత్తులో ఆలయ పాలక మండలి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

# తుది నోటిఫికేషన్

(మొదటి పేజి (తరువాయి)

ఏపీ ప్రభుత్వం పేర్కొంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరుల సేవల చేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది. తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రానున్నాయి. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్ని విధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యక్రమాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు సమగ్ర సేవలు, వేగవంతమైన పరిపాలన, వనరుల సమర్థవంతమైన వినియోగం అందించగలిగే అవకాశాలు పెరుగుతాయని ఏపీ సర్కార్ అనుకుంటుంది. మార్పుల్లో నందిగామ మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌కు మార్చారు. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలక మార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్ట్రక్చర్ చేయడం, పెనుగొండను వాసవీ పెనుగొండుగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికేషన్‌లో చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్ రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాల సరిహద్దులను మార్చడం ద్వారా స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది.

# మాటిచ్చా..నెరవేర్చుతున్నా



(మొదటి పేజి (తరువాయి)

45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. 35 రోజుల్లోపే ఈ సమస్యకు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిష్కారం చూపినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ క్రమంలో అధికారులకు పవన్ కీలక సూచనలు చేశారు. రాజోలు నియోజకవర్గ రైతులకు ఐదేళ్లుగా దుఃఖదాయనిగా మారిన శంకర్ గుప్తం మేజర్ డ్రైనేజ్ సమస్యను సుబ్రహ్మణ్య షష్టి రోజున గుర్తించామని తెలిపారు. కేవలం 34 రోజుల కాలవ్యవధిలో శాశ్వత పరిష్కారం దిశగా ముక్కోటి ఏకాదశిన పనులు ప్రారంభించామని వెల్లడించారు. ఈ పనులకు రూ.20.62 కోట్లు కేటాయించామని అన్నారు. శంకర్ గుప్తం ప్రధాన మురుగు కాల్వతో వరి, కొబ్బరి చెట్లను రైతులు కోల్పోయారని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపినట్లు వివరించారు. కేవలం 34 రోజుల్లోనే ఈ పనుల నిర్వాహణకు నిధులు కేటాయించామని చెప్పుకొచ్చారు. కొబ్బరి చెట్లకు నష్టం కలుగకుండా సంరక్షణ చర్యలు చేపడతామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.4 వేల కోట్లతో పంట కాలువలు, మురుగు కాలువలు ఆధునీకీకరిస్తామని తెలిపారు. కోనసీమ ప్రాంతనీలో కోకో బోర్డు ఏర్పాటు చేయడానికి కేంద్రప్రభుత్వంతో సంప్రదిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఫెయిల్యూర్ పొలిటీషియన్

## విలాసం కోసం రుషికొండపై ప్యాలెస్..రూ.400 కోట్ల ప్రజల సొమ్ము దుబారా

## మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర



**ఒంగోలు, డిసెంబర్ 30 :**

జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన ఓ దగాకోరు అంటూ వ్యాఖ్యలు చేశారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం, ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారని మండిపడ్డారు. దీనికి జగన్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన అహంభావి అన్నారు. రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామని.... లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు. జగన్ ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వైఎస్ఆర్ పార్టీ సమాధిగా మారి పోతుందంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## బెజవాడ కనకదుర్గమ్మను

# దర్శించుకున్న అనీల్ రావిపూడి

**విజయవాడ, డిసెంబర్ 30 :**

దుర్గమ్మ వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. మంగళవారం ఉదయం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువదీరిన దుర్గమ్మ వారిని డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదంతోపాటు చిత్ర పటాన్ని ఆయనకు ఆలయ అధికారులు అందజేశారు. ఆ తర్వాత వేద పండితులు ఆయన్ని ఆశీర్వదించారు. ఆలయం బయట అనిల్ రావిపూడి విలేకర్లతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండగకి మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వర ప్రసాద్ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. ఈ సినిమా ఇప్పటికే పూర్తయిందని.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుందని వివరించారు. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ పాడిన పాట.. ఈ చిత్రానికే హైలెట్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. తాను గుంటూరులో చదివిన కాలేజీలో ఒక సాంగ్ రిలీజ్ చేయబోతున్నామని వివరించారు. ఈ చిత్రం బాగా వచ్చిందన్నారు. ప్రజలు ఈ చిత్రాన్ని ఆశీర్వాదిస్తారని ఆశిస్తున్నట్లు డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు.



# గోవిందనామ స్మరణం



(మొదటి పేజి (తరువాయి)

కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణెళిష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

# గుర్తింపు కార్డు వద్దులే

(మొదటి పేజి (తరువాయి)

చేశారు. ఈ నిబంధన వల్ల కండక్టర్లపై అనవసరంగా ఒత్తిడి పెరుగుతోందని, దీన్ని తీసేస్తే మహిళలతో పాటు కండక్టర్లకు కూడా ఊరట లభిస్తుందని వారు చంద్రబాబు దృష్టికి తెచ్చారు. ఈ నిబంధన లేకపోతే సులువుగా వేగంగా టికెట్లు ఇచ్చేందుకు వీలు కలుగుతుందన్నారు.దీంతో సీఎం చంద్రబాబు కూడా దీనిపై సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.ఈ మేరకు కొత్త ఏడాదిలో ఈ గుర్తింపు కార్డుల నిబంధన తొలగించే అవకాశం ఉంది. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో అమలు చేసి ఇతర ప్రాంతాల్లో ఈ గుర్తింపు కార్డులు చూపించి ప్రయాణాలు చేయాలనే నిబంధన తొలగిస్తారని చెప్తున్నారు. ప్రభుత్వం త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

# పెన్షన్‌దారులపై మరో సర్వే

(మొదటి పేజి (తరువాయి)

అమలవుతోంది అనే అంశంపై 3 ప్రశ్నలు అడుగుతారు. వాటికి పెన్షన్ లబ్దిదారులు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో అవినీతి ఉందా?, ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ ఇంటి దగ్గరే అందుతోందా?, పింఛన్ అందించిన అధికారి ప్రవర్తన ఎలా ఉంది? వంటి మూడు ప్రశ్నల్ని అడుగుతారు. వీటిని అవును, బాగుంది అయితే 1 లేదు, బాగోలేదు అయితే 2 నొక్కమని అడుగుతుంది. వీటికి లబ్దిదారులు సరైన సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.ఈ ప్రశ్నలకు పెన్షన్ల లబ్దిదారులు ఇచ్చే సమాధానాల ఆధారంగా ప్రభుత్వం కొత్త సంవత్సరంలో పెన్షన్ పంపిణీపై కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అలాగే అవినీతి జరుగుతోంది అని తేలితే సచివాలయ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇంటి దగ్గరకు వచ్చి పెన్షన్ ఇవ్వట్లేదు అని తెలిస్తే అందుకు తగిన చర్యలు తీసుకుంటారు. ఈ సర్వే ద్వారా పెన్షనర్ల సంఖ్యను ప్రభుత్వం తగ్గించిందా లేదా అనేది కూడా తేలిపోనుంది. కాబట్టి ఈ సర్వేలో లబ్దిదారులు చురుగ్గా పాల్గొనాలని అధికారులు కోరుతున్నారు.

## బంగ్లా మాజీ ప్రధాని

# ఖలీదా జియా మృతి



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 30 :**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బీఎన్‌పీ అధినేత్రి ఖలీదా జియా(80) కన్నుమూశారు. గుండె, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకడంతో నవంబర్ 23న ఢాకాలోని ఎవర్ కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు న్యుమోనియా సోకినట్లు డాక్టర్లు నిర్ధరించారు. ఆ తర్వాత వేగంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. గుండె, కిడ్నీ, లివర్, డయాబెటిస్, ఊపిరితిత్తులు తదితర ఆరోగ్య సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఫజ్రు ప్రార్థనల తర్వాత ఆమె తుదిశ్వాస విడిచారు.

ఖలీదా జియా బంగ్లాదేశ్ రాజకీయాలపై బలమైన ముద్ర వేశారు. ఆమె 1991 - 1996, 2001 - 2006 మధ్య పదేళ్లపాటు ప్రధానిగా పని చేశారు. బంగ్లాదేశ్‌లో కేర్ టేకర్ గవర్నమెంట్ వ్యవస్థను ఆమె తొలుత ప్రవేశపెట్టారు. అవినీతి కేసులో 2018 నుంచి 2020 వరకు జైల్లో గడిపారు. ఇటీవల ఆమె కుమారుడు తారిక్ రెహమాన్ 17 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు. మరో కుమారుడు అరాఫత్ రెహమాన్ కోకో కొన్నేళ్ల క్రితం మలేసియాలో కన్నుమూశారు. 1945లో వ్యాపారవేత్త సికందర్ కుటుంబంలో జన్మించిన ఖలీదాజియా.. 1960లో జియావుర్ రెహమాన్‌ను వివాహం చేసుకొన్నారు. బంగ్లా విమోచన యుద్ధంలో జియావుర్ పాక్‌పై తిరుగుబాటు చేసి యుద్ధంలో పాల్గొన్నారు. 1981లో ఆయన హత్య తర్వాత బీఎన్‌పీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. దీంతో ఖలిదా జియా పార్టీ పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత పదేళ్లకు తొలిసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

ఖలీదా మృతికి మోడీ సంతాపం

నేడు అంత్యక్రియలకు జై శంకర్ హాజరు...

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్‌పర్సన్ బేగం ఖలీదా జియా అంత్యక్రియలకు భారత ప్రభుత్వం తరఫున కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ హాజరవుతున్నారు. ఇందుకోసం బుధవారంనాడు ఆయన ఢాకా బయలుదేరి వెళ్తున్నారు. ఇటీవల కాలంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు క్షీణించిన తరుణంలో జైశంకర్ ఢాకా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. బేగం ఖలీదా జియా (80) సుదీర్ఘ అస్వస్థతతో మంగళవారం ఉదయం 6 గంటలకు ఢాకా అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండె, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో నవంబర్ 23న ఆసుపత్రిలో చేరిన ఆమె 36 రోజులుగా చికిత్స పొందుతున్నారు. దేశ తొలి మహిళా ప్రధానిగా బంగ్లాదేశ్ అభివృద్ధి, భారత్‌తో సత్సంబంధాలకు జియా విశేష కృషి చేశారు. బేగం ఖలీదా జియా మృతికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. భారత్-బంగ్లా సంబంధాల బలోపేతానికి బేగం ఖలీదా జియా చేసిన కృషిని ప్రశంసించారు.


హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు మోహన్ నాయక్

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

**గుత్తి, డిసెంబర్ 30:**
జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడుతామని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర నాయకులు మోహన్ నాయక్ హెచ్చరించారు. గుత్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి మోహన్ నాయక్ విద్యార్థులతో కలిసి సమావేశం నిర్మించారు. ఈ సందర్భంగా బి. మోహన్ నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎస్సీ ఎస్టీ బిసి, గిరిజన గురుకులాల్లో నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదన్నారు. మెనూ ప్రకారం అందించడం లేదన్నారు. చికెన్ నీళ్ల రసంతో ఒకటి, రెండు, ముక్కలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆదివారం బిర్యానీ ఇవ్వల్సి ఉండగా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. పెరుగు పచ్చడి, గోగాగు పచ్చడి ఇవ్వడం లేదన్నారు. రసం చికెన్ మాత్రమే ఇస్తున్నారన్నారు. ఇటీవల ఫుడ్ కమిషన్ మెంబర్ గంజి మాలదేవి ప్రభుత్వ హాస్టల్స్‌ను తనిఖీ చేశారని, అయినా ప్రభుత్వ హాస్టళ్లలో పరిస్థితి మారలేదన్నారు. మోడల్ స్కూల్, హాస్టల్, ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన భోజనం, మెను ప్రకారం భోజనం అందించాలని, అధికారులు వారంలో రెండు సార్లు హాస్టల్‌ను తనిఖీ చేయాలిలని, అధికారులు హాస్టల్‌లో నిద్రించాలి లేని పక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, మణికంత, చంటి, అశోక్, రమేష్, రామకృష్ణ, ధర్మ కుమార్, అశోక్, రాజశేఖర్, రమణ, అంజి పాల్గొన్నారు.


ఆభరణాల అలంకరణలో అమ్మవారు (ఫైల్ ఫోటో).

## అనుంపల్లి సుంకులమ్మ దేవాలయంలో చోరీ

*రూ.16 లక్షల విలువచేసే 6 కేజీల వెండి ఆభరణాల అపహరణ ..*


**పామిడి, డిసెంబర్ 30:**
మండల పరిధిలోని అనుంపల్లిలో కొలువైన శ్రీ వద్దుగట్ట సుంకులమ్మ దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డ సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి దేవాలయ అర్చకులు, ధర్మకర్త తెలిపిన వివరాలిలావున్నాయి. రోజూవారి పూజల నిమిత్తం మంగళవారం వేకువజామున అర్చకులు దేవాలయానికి వెళ్ళగా తాళాలు పగులగొట్టి ఉండటంతో లోనికివెళ్ళి చూడగా అమ్మవారి అలంకరణలోని వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అమ్మవారి అలంకరణలోని రూ.16 లక్షల విలువచేసే వెండి ఆభరణాలైన 3.75 కేజీల మకర తోరణం, అరకేజీ చిన్నది, 1 కేజీ ముఖావతి, అరకేజీ కిరీటం, కాల్ కేజీ గొడుగు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దేవాలయానికి చేరుకుని జరిగిన సంఘటనపై అర్చకులు, ధర్మకర్త వద్ద వివరాలను అడిగి తెలుసుకున్నారు. చోరీపై కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.


అమ్మవారి ఆభరణాలు చోరీ చేసిన దృశ్యం


శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శేష తల్ప రంగనాథ స్వామికి ప్రత్యేక అలంకరణ

## శేషతల్ప అలంకరణలో శ్రీ రంగనాథస్వామి

**తాడిపత్రి, డిసెంబర్ 30:**
మండల పరిధిలోని శ్రీ ఆలూరు రంగనాథ స్వామి దేవస్థానంలో ధనుర్మాసం పదహైదవరోజు సందర్భంగా వైకుంఠ ఏకాదశిని పునస్కరించుకొని మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శేష తల్ప అలంకరణలో శ్రీ రంగనాథ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, ఇతర అభిషేకాలు గావించిన అనంతరం సుందర పుష్పాలంకరణ గావించి, విశేష పూజలు నిర్వహించారు. ఉంజల్ సేవలో శ్రీ రంగనాథస్వామి సేద తీరుతూ భక్తులకు దర్శనమిచ్చారు.


ఆలూరుకోనలో శ్రీ రంగనాథస్వామికి ఉంజల్ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

# ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

## భక్తులకు స్వర్గద్వారాలు తెరిచేరోజే వైకుంఠ ఏకాదశి ..

**పామిడి, డిసెంబర్ 30:**
ఉపవాసం ఉండే విష్ణు భక్తులకు స్వర్గద్వారాలు తెరిచేరోజైన వైకుంఠ ఏకాదశిని హిందువులు శుభప్రదంగా భావిస్తారని శ్రీ అనంత గజ గరుడ లక్ష్మీనారాయణస్వామి దేవాలయ అర్చకులు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, శ్రీ రంగ సుభే భగవాన్ దాస్ విఠోభాస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయాల్లో మంగళవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరిగాయి. ఆయాదేవాలయాల్లో స్వాముల వారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేపట్టారు. శ్రీ అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయాల్లో గోవింద నామస్మరణ, విష్ణు సహస్ర నామ పారాయణంతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో స్వాముల వారి ప్రాకారోత్సవాన్ని నిర్వహించి మహామంగళహారతి గావించారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ విఠోభాస్వామికి పూజలు చేపట్టిన అనంతరం స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించగా దారిపొడవునా భక్తాదులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేపడుతూ తీర్థప్రసాదాలను


భక్తుల గోవింద నామస్మరణ మధ్య స్వామివారి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి

స్వీకరించారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు భక్తాదులు పెద్దఎత్తున తరలి రావటంతో ఆయాదేవాలయాలు కిటకిటలాడటంతో పాటు గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. భక్తాదులు పూజలు చేపడుతూ స్వాముల వారి కృపకు పాత్రులయ్యారు. వైకుంఠ ఏకాదశి అనేది ధనుర్మాసంలో వచ్చే పవిత్రమైన రోజు అని భక్తులు ఉత్తర ద్వార ప్రవేశించి మహావిష్ణువును దర్శించుకోవటం మోక్షం పొందడానికి ఒక సంకేతంగా పరిగణించబడుతుందని తెలిపారు. శ్రీ మహావిష్ణువు గరుడ వాహనంపై ముక్కోటి దేవతలు, భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తూ చింతామణిలా భక్తుల కోర్కెలు తీర్చి మోక్షాన్ని ప్రసాదించే ఏకాదశి కాబట్టి దీనిని మోక్షదా ఏకాదశి అని కూడా అంటారని వెల్లడించారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు..

## స్వపక్ష కౌన్సిలర్ల ధ్వజం..

**గుత్తి, డిసెంబర్ 30:**
ప్రజా సమస్యలను పరిష్కరించలేని సమావేశాలను ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని పలువురు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం గుత్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్పర్సన్ వన్నూరు బి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన అధికార పక్షానికి చెందిన పలువురు వార్డు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ పైన డి ఈ పైన ప్రశ్నలతో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెల్లే వరలక్ష్మి వార్డు కౌన్సిలర్లు వరదరాజులు షబ్బీర్ శివ తో పాటు పలువురు వార్డు కౌన్సిల్లో తమ వార్డుల్లో సమస్యలను పరిష్కరించడంతో మున్సిపల్ అధికారులను నిర్లక్ష్యం భావిస్తున్నారని తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రతి సమావేశంలోనూ సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇస్తున్నారు తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదని వారు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో నేటికీ తాగునీటి సక్రమంగా సరఫరా కావడం లేదని విద్యుత్ స్తంభాలకు విద్యుత్ దీపాలను వెలిగించడం లేదని అనేక ప్రాంతాల్లో సక్రమంగా డ్రైనేజీలను నిర్వహించడం లేదని దీంతో డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు అన్నారు. వివిధ వార్డులో వీధి కుక్కలు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని అనేకమంది వీధి కుక్క కాటుకు గురై ఆసుపత్రి పాలవుతున్నారని మున్సిపల్ అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు కుక్కలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని చెబుతున్నారు తప్ప తిరిగి యధావిధిగా వీధి కుక్కలు మనుషులపై దాడులు చేస్తూనే ఉన్నాయన్నారు.


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న వైఎస్సార్సీపీ కౌన్సిలర్

ఏ వార్డులో ఏ రకమైన అభివృద్ధి పనులు చేపడుతున్నారు కనీసం ఆయా వార్డు కౌన్సిలర్లకు సైతం అధికారులు సమాచారం ఇవ్వటం లేదన్నారు. దీంతో మున్సిపాలిటీలో గందరగోళ్ల పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలకు సమాధానం చెప్పుకోలేక అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని చెప్పలేక తాము శ్రతమతమవ్వాల్సి వస్తుందని పలువురు వార్డు కౌన్సిలర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో మెజారిటీ వార్డు సభ్యులు అనగా 25 వార్డులు ఉండగా అందులో 24 మంది వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు కావడం విశేషం. అయితే మెజారిటీ ఉన్న వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఇతర కార్యక్రమాల పట్ల తమకు సమాచారం ఇవ్వటం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడం ఇక్కడ కొసమెరుపు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియాతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు

# వైభవంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

## దర్శనానికి పోటెత్తిన భక్తులు..

**తాడిపత్రి, డిసెంబర్ 30:**
చారిత్రాత్మక దేవాలయంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ చింతల వెంకటరమణస్వామి దేవస్థానంలో మంగళవారం అంగరంగ వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. శ్రీ చింతల వెంకటరమణస్వామి దేవస్థానానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శనం


శ్రీ చింతల వెంకటరమణ స్వామికి పల్లకి సేవ నిర్వహిస్తున్న దృశ్యం


గరుడ వాహనంపై శ్రీ చింతల రాయుడు

కోసం తెల్లవారుజాము నుండే భక్తులు పోటెత్తారు. గోవింద నామస్మరణతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవస్థానాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున 3 గంటలకు అర్చకులు ఆలయ ప్రధాన ద్వారాలు తెరిచారు. శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశిని పునస్కరించుకొని సుప్రభాత సేవ చేపట్టారు.
ఆలయంలో ఉత్తర ద్వార ముఖంగా కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం నుంచి గరుడ వాహనంపై శ్రీ చింతల వెంకటరమణ స్వామి భక్తులకు దర్శననిచ్చారు. పట్టణ పురవీధుల్లో చింతల రాయుడిని నేత్ర శోభితంగా గ్రామోత్సవం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెప్పించిన లడ్డు ప్రసాదం భక్తులకు వితరణ గావించారు.


చింతలరాయుని దేవాలయానికి పోటెత్తిన భక్తులు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సుప్రభాత సేవలో పాల్గొన్న భక్తులు

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులతో కిట కిటలాడిన ఆలయాలు

**గుత్తి, డిసెంబర్ 30:**
మండల పరిధిలోని వివిధ ఆలయాలు వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి . ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం . తొండపాడు గ్రామంలోని శ్రీ బోలికొండ రంగనాథ స్వామి ఆలయం. కొత్తపేట గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాల ను ఆలయ కమిటీల నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం ద్వారా దేవుడు అనుగ్రహం లభించడంతో పాటు ప్రచారంలో ఉండడంతో మండల పరిధిలోని


స్వామివారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

వివిధ గ్రామాల నుండి పక్షులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఈ సందర్భంగా ఆయన ప్రాంతాల్లోని ఆలయాల్లో ఎలాంటి అవాన్ చర్య సంఘటనలు జరగకుండా గుత్తి సిఐ రామారావు ఎస్సై సురేష్ ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## అవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 30:**
అనంతపురం అవోపా మహిళా విభాగ్ సభ్యులు నగరంలోని పాతూరు చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అవోపా మహిళా విభాగ్ ప్రెసిడెంట్ గూడూర్ అనురాధ, సెక్రటరీ గీత కుమారి, ట్రెజరర్ రమాదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా విభాగం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి అయి నాలుగవ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.


ధ్యాన శివుడిని నీటితో శుద్ధి చేస్తున్న దృశ్యం

## ధ్యాన శివునికి ప్రత్యేక పూజలు

**తాడిపత్రి, డిసెంబర్ 30:**
వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పునస్కరించుకొని మంగళవారం తాడిపత్రి-అనంతపురం హైవే రోడ్డు మీద ఏర్పాటుచేసిన ధాన్య శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పరమ శివుడి విగ్రహాన్ని అగ్నిమాపక సిబ్బంది నీటితో శుద్ధి చేయగా, మున్సిపాలిటీ వారి ల్యాడర్ సహకారంతో పూలమాల వేశారు. అనంతరం ధ్యాన శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా టాటా హాజివలి




**తాడిపత్రి, డిసెంబర్ 30:**
తెలుగుదేశం పార్టీ తాడిపత్రి పట్టణ అధ్యక్షుడిగా ముస్లిం మైనారిటీకి చెందిన టాటా హాజివలి నియామకం జరిగింది. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో టాటా హాజివలిపై అనేక దాడులు, అక్రమ కేసులు, జరిగినాయి. అయినా భయపడక జేసీ కుటుంబం మీద ప్రేమతో, తెలుగుదేశం పార్టీ మీద అభిమానంతో పోరాడినందుకు శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ గుర్తించి టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమించారు.


విశేష అలంకరణలో శ్రీ వెంకటేశ్వర స్వామి

## వైభవంగా వైకుంఠ ఏకాదశి

**రామకుప్పం, డిసెంబర్ 30:**
మండలంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పలు దేవాలయాల్లో విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున విజాలాపురంలోని సత్యభామ,రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి, మండల కేంద్రంలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గోవింద నామ స్మరణతో మార్మోగించారు. ఆలయ నిర్వాహకులు పచ్చ తోరణాలు విద్యుత్ దీపాలంకరణ చేసి భక్తులకు కనువింపు చేశారు. భక్తాదులు స్వామి వార్లకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతిలిచ్చి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకారంలోకోట లక్ష్మీనరసింహస్వామి



# నేడు పింఛన్ల పంపిణీ

**మండలంలో 6,160 మంది లబ్ధిదారులు.. ఎంపీడీవో నరసింహనాయుడు ..**

**బత్తలపల్లి, డిసెంబర్ 30:**
బత్తలపల్లి మండల వ్యాప్తంగా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ నేటి నుంచి రెండు రోజుల పాటు లబ్ధిదారులకు పింఛన్లను అందజేయనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరసింహనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేస్తారు. అయితే, జనవరి 1వ తేదీన నూతన సంవత్సర వేడుకలు ఉన్నందున, లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఒక రోజు ముందే పంపిణీ ప్రక్రియను ప్రారంభించనుందని ఆయన వివరించారు.? మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 6,160 మంది లబ్ధిదారులకు జనవరి నెల సంబంధించి రూ. 2,73,79,000 లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో పంపిణీ జరుగుతుందని,పింఛన్లకు సంబంధించి నగదును ఇప్పటికే గ్రామ కార్యదర్శులు బ్యాంకుల నుంచి డ్రా చేశారని ఎంపీడీఓ పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో తమ పింఛన్లను తీసుకోవాలని ఆయన సూచించారు.

# రేపు కెప్టెన్ దీపికకు సన్మానం

**కార్యక్రమాన్ని విజయవంతం చేయండి మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ఎం లోకేష్ ..**

**అగళి, డిసెంబర్ 30 :**
జనవరి 1న నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని నీలకంఠాపురంలో గురువారం ఉదయం 10-30 గంటలకు దేవస్థానాల ఆలయ ధర్మకర్త కమిటీ చైర్మన్ మాజీ మంత్రివర్యులు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో భారత అందుల క్రికెట్ జట్టు కెప్టెన్ అమరాపురం మండలం, తంబాళ హట్టి గ్రామానికి చెందిన కుమారి దీపికకు ఘన సన్మానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నీలకంఠాపురం దేవస్థానాల కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సన్మాన కార్యక్రమానికి అగళి మండలం నుంచి క్రీడాకారులు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కెప్టెన్ దీపిక సన్మాన కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు.





# ఏడీసీసీ బ్యాంక్ బంగారు రుణాలను సద్వినియోగం చేసుకోండి


**మండల సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్ గణేష్ ..**

**అమరాపురం, డిసెంబర్ 30:**
మండలంలోని ఎడిసిసి బ్యాంక్ ఖాతా దారులు బంగారు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అమరాపురం మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఎన్ గణేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఏ.డి.సి.సి. బ్యాంక్ నందు ఒక గ్రాము బంగారంపై 8వేల రూపాయలు రుణాలు అందిస్తోందని 11%, 9% అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని బ్యాంక్ ఖాతాదారులందరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు.

# నేడు మడకశిరలో ఆర్డీవో కార్యాలయం ప్రారంభం

**ప్రజా ప్రతినిధులు రైతులు తరలిరండి.. తెదేపా మండల అధ్యక్షులు కృష్ణమూర్తి..**

**అమరాపురం, డిసెంబర్ 30:**
మడకశిర ప్రాంత ప్రజల చిరకాల వాంఛ, నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న రెవిన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం అందించాలన్న ఉద్దేశంతో, విద్యార్థులకు, ఉద్యోగులకు, ప్రజలందరికీ ప్రభుత్వ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసేందుకు పాలనా సౌలభ్యం కోసం మడకశిరను రెవిన్యూ డివిజన్ గా గుర్తించి మడకశిర నియోజకవర్గ కేంద్రంలో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు వారి ఆదేశాల మేరకు నేడు అనగా బుధవారం ఉదయం 12.00 గంటలకు మడకశిరలో ఆర్డీవో కార్యాలయాన్ని మడకశిర శాసనసభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు మరియు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి గార్ల ఆధ్వర్యంలో ప్రారంభం జరుగుతుందని అమరాపురం మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు



# ముదిగుబ్బలో ముక్కోటి ఏకాదశి శోభ

## ఉత్తర ద్వార దర్శనంతో పరవశించిన భక్తజనం..

**ముదిగుబ్బ, డిసెంబర్ 30:**
ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ముదిగుబ్బ మండలమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. గ్రామగ్రామాన ఆలయాలు భక్తుల నామస్మరణతో మార్మోగగా, ఉత్తర ద్వార దర్శనాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలతో ఆలయాలు పండుగ కళను సంతరించుకున్నాయి. ముదిగుబ్బ పాతఊరిలోని పురాతన శ్రీ సూర్యచంద్ర అభయాంజనేయ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల కోసం ఉత్తర ద్వారాన్ని తెరిచి విశేష దర్శన ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి అనంతరం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, అనంతరం వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు సమర్పించారు. వేకుజాము నుంచే వేలాదిమంది భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మార్మోగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. పండుగ రోజు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముదిగుబ్బలోని శ్రీ హరిహర గణేష దేవాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకొని కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని మొలకవేముల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ ముక్కోటి ఏకాదశి ఘనంగా జరిగింది. ఉత్తర ద్వార దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించగా, బండి మల్లికార్జున కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. ముదిగుబ్బ మండల వ్యాప్తంగా జరిగిన ముక్కోటి ఏకాదశి వేడుకలు భక్తుల్లో భక్తి, శ్రద్ధ, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి. ఉత్తర ద్వార దర్శనం ద్వారా వైకుంఠ ద్వార దర్శన ఫలితం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషంగా కనిపించింది.



మొలకవేమలలో పూజలందుకున్న శ్రీ వెంకటేశ్వర స్వామి





శ్రీ సూర్యచంద్రభయాంజనేయ స్వామిని అలంకరించిన దృశ్యం. ముదిగుబ్బలో పూజలు అందుకుంటున్న శ్రీ వెంకటేశ్వర స్వామి

# గోవింద నామస్మరణతో మారుమోగిన దేవాలయాలు

## ముక్కోటి ఏకాదశి వేళ ఉత్తరద్వార దర్శనం.. ఆలయాలక్కు పోటెత్తిన భక్తజనం..

**బత్తలపల్లి, డిసెంబర్ 30:**
మండల వ్యాప్తంగా మంగళవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, కుటుంబ సమేతంగా ఆలయాలకు తరలి రావడంతో ప్రతి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. దేవతామూర్తుల ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ముక్కోటి ఏకాదశి విశిష్టతను చాటుతూ మండలంలోని పలు ప్రధాన ఆలయాల్లో బత్తలపల్లి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ముస్తూరు శివాలయం, దంపెట్ల చెన్నకేశవ ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. అర్చకులు రామకృష్ణాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షురాలు ద్రాక్షాయని, శ్రీనివాసచార్యులు భక్తులకు ఏకాదశి మహత్యాన్ని వివరించారు. పోట్లమర్రి ఆంజనేయస్వామి, గంటాపురం అప్పస్వామి, సంజీవపురం కాటికోటేశ్వర క్షేత్రం, సంగమేశ్వర క్షేత్రం, డి. చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, జ్వాలాపురం లక్ష్మీనరసింహస్వామి, మాల్యవంతం వీరనారాయణ స్వామి ఆలయాలు భక్తజనసంద్రమయ్యారు. పోట్లమర్రి ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు రాత్రంతా మేల్కొని భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్ కుమార్, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైఎస్ఆర్సిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమతం ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్ రెడ్డి, నియోజవర్గ కల్చరల్ విభాగం అధ్యక్షులు షరాబ్ యోగానంద ఆచారి, మండల కన్వీనర్ మాది రెడ్డి జయరామి రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు మందల నరసింహులు తదితర ప్రముఖులు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో దంపెట్ల చెన్నకేశవ స్వామి



ప్రత్యేక పూజలో పాల్గొన్న అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్ కుమార్ దంపతులు

# ఘనంగా వైకుంఠ ఏకాదశి

**గుడిబండ, డిసెంబర్ 30:**
గుడిబండ శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం ఘనంగా వైకుంఠ ఏకాదశి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కి అర్చకులు రంగురంగు పూలతో అలంకరించి కుంకుమార్చన పూలర్చిన వివిధ నైవేద్య అభిషేక కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు భక్తి శ్రద్దలతో మొక్కుబడులు తీర్చుకొని మహా మంగళహారతి చేయించుకుని తీర్థ ప్రసాదం వియోగించారు.అనంతరం భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించిన దృశ్యం

# పార్టీ బలోపేతానికి బూత్ స్థాయే పునాది

## ఉత్తమ కన్వీనర్లకు టీడీపీ గుర్తింపు..

**ముదిగుబ్బ, డిసెంబర్ 30:**
పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో బూత్ కన్వీనర్ల పాత్ర కీలకమని తెలుగుదేశం పార్టీ మరోసారి స్పష్టం చేసింది. రాష్ట్ర టీడీపీ కార్యాలయం నుంచి ఎంపికైన ఉత్తమ బూత్ కన్వీనర్లకు ధర్మవరం టీడీపీ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మంగళవారం జరిగిన ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, ధర్మవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు పరిసే సుధాకర్, ముదిగుబ్బ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పాల్గొన్నారు. ముదిగుబ్బ మండల వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, సంస్థాగతంగా బలంగా నిలిచిన 23 మంది బూత్ కన్వీనర్లను గుర్తించి రాష్ట్ర టీడీపీ తరపున జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు.



ఉత్తమ బూత్ కన్వీనర్లుగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందిస్తున్న దృశ్యం



ఉత్తమ బూత్ కన్వీనర్లుగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ సందేశాన్ని నాయకులు కార్యకర్తలకు వివరించారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఆస్తి అని, పార్టీ కోసం కష్టపడిన వారిని ఎప్పటికీ విస్మరించబోమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు గౌరవం, గుర్తింపు కల్పించడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి కార్యకర్త శ్రమను గుర్తించి, వారికి గౌరవమైన స్థానం కల్పించడంతో పాటు కార్యకర్తల సంక్షేమం, అభివృద్ధికి టీడీపీ నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఉత్తమ బూత్ కన్వీనర్లుగా ఎంపికైన రాధమ్మ, నందకుమార్ నాయుడు, బుర్ర చంద్ర సేన, లింగార్జున, అబ్దుల్ రజాక్, గంగన్న, ధనుంజయ నాయుడు, రామ్మూర్తి, హేమలత భాయ్, ప్రతాప్, భాను ప్రకాష్, రామాంజనేయులు, రమేష్, అమరేశ్వర రెడ్డి, భాస్కర్, శివయ్య గోవర్ధన లక్ష్మీపతి మోహన్ నాయుడు, జేబీవుల, బాలకృష్ణ లకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని నింపి పార్టీ బలోపేతానికి మరింత దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఓ నాగమల్లేశ్వరి

# అంగన్వాడీలు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలి

**సీడీపీఓ నాగమల్లేశ్వరి..**

**అగళి, డిసెంబర్ 30 :**
అంగన్వాడీలు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని పాండురంగస్వామి దేవాలయం లోగల అంగన్వాడి సెంటర్లో మండలంలోని అంగన్వాడి కార్యకర్తలతో సూపర్వైజర్ లీలావతి ఆధ్వర్యంలో సెక్టార్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి అంగన్వాడి కార్యకర్త విధినిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని తెలిపారు.బాలసంజీవిని, పోషణ ట్రాకర్ 2యాప్ లు రోజువారి అటెండెన్స్, ఫుడ్ రిసిప్ట్,టెక్ హెూమ్, రేషన్ ఈకెవైసి చేయించాలని అదేవిదంగా ఫోటో కాప్చర్,ప్రీస్కూల్ యాక్టివిటీ తదితర విషయాలను వివరించారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ నాగమల్లేశ్వరి తో పాటు సూపర్వైజర్ లీలావతి, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బత్తలపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

**రూ. 15 వేల విలువైన కాపరు వైరు అపహరణ .. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఏఈ శివయ్య ..**

**బత్తలపల్లి, డిసెంబర్ 30 :**
బత్తలపల్లిలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. స్థానిక పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల.. బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రి పక్కన ఉన్న ఎయిర్టెల్ టవర్ విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా ఒక సింగిల్ పేస్ ట్రాన్స్ ఫార్మర్ను ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటల ప్రాంతంలో దొంగలు ట్రాన్స్ ఫార్మర్ను విద్యుత్ స్తంభం పై నుంచి కిందకు పడవేసి, అనంతరం దానిని ధ్వంసం చేసి, అందులో ఉన్న సుమారు 20 కేజీల కాపర్ వైర్ తో పాటు,ట్రాన్సపార్మర్ ఆయిల్ ను కూడా దొంగలించుకుపోయారు. అపహరణకు గురైన సొత్తు విలువ సుమారు 15000 రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రాన్స్కో అధికారుల ఫిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఇదే ప్రాంతంలోని వ్యవసాయ బావుల వద్ద కూడా తరచూ విద్యుత్ పరికరాల చోరీలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ఈ శివయ్య విద్యుత్ పరికరాల చోరీల నేపథ్యంలో మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని బత్తలపల్లి విద్యుత్ శాఖ ఏఈ శివయ్య కోరారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్కో ఏఈ శివయ్య

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**గుడిబండ, డిసెంబర్ 30:**
మండల పరిధిలోని పలారం గ్రామ సమీపంలో ఉన్న చర్చి మందిరంలో మంగళవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మంజునాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రవచనాలు ప్రార్థనలు ఆటపాటలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఏసుప్రభు యొక్క దీవెనలు ప్రతి ఒక్కరికి ఉండాలని ప్రార్థన చేస్తూ వారి వారి కుటుంబాలను చల్లగా చూడాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు తిప్పే స్వామి, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు



గుడిబండ, చర్చిలో ప్రార్థన నిర్వహిస్తున్న దృశ్యం

# ముదిగుబ్బ మండల ప్రజలకు సీఎం సహాయ నిధి అండ

**ధర్మవరం టీడీపీ కార్యాలయంలో చెక్కుల పంపిణీ..**

**ముదిగుబ్బ, డిసెంబర్ 30:**
అవసర సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మంగళవారం ధర్మవరం టిడిపి పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ మండలానికి చెందిన బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా అందజేయడం జరిగింది. సహస్రకు రూ.58,000, ఆదినారాయణకు రూ.30,786, పుల్లా నాయుడుకు రూ.30,800, వనగాని రామకృష్ణకు రూ.35,800 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. చెక్కులను కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, ధర్మవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు పరిసే సుధాకర్, ముదిగుబ్బ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, అనారోగ్యం లేదా ఇతర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి సహాయ నిధి లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం సకాలంలో అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ముదిగుబ్బ మండల ప్రజలకు అవసరమైన సహాయం అందేలా నిరంతరం ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ పనిచేస్తామని నాయకులు హామీ ఇచ్చారు



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న నాయకులు



మోహన్ రెడ్డి మెమోరియల్ 10వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

## మోహన్ రెడ్డి మెమోరియల్ 10వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్లు ఆవిష్కరణ

**ఎమ్మిగనూరు, డిసెంబర్ 30:**
శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా బి.వి. మోహన్ రెడ్డి స్మృతితో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్లను ఎమ్మెల్యే, పీఏసీ సభ్యులు డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల నిర్వాహకులు, యువకులు మరియు అభిమానులు పాల్గొన్నారు.



మోహన్ రెడ్డి మెమోరియల్ 10వ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే కరెంటోళ్ల జనబాట కార్యక్రమం

*విద్యుత్ శాఖ ఏఈ నారాయణ స్వామి ..*

**పెద్దకడబూరు, డిసెంబర్ 30 :**
గ్రామాల్లో విద్యుత్ సమస్యలను గుర్తించి, వాటి ఎరిష్కారమే కరెంటోళ్ల జనబాట కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని విద్యుత్ శాఖ ఏఈ నారాయణ స్వామి స్పష్టం చేశారు. మంగళవారం పెద్దకడబూరు గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వినియోగదారులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ నాణ్యమైన, నిరంతరాయంగా విద్యుత్ సరఫరాయే ధ్యేయంగా ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో కరెంటోళ్ల జనబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రతి మంగళ, శుక్రవారాలలో నిర్దేశిక గ్రామాలలో పర్యటించి విద్యుత్ సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు. 11కేవీ, ఎల్టీ, వ్యవసాయ విద్యుత్ లైన్ల పరిశీలన, కిందకు వేలాడే విద్యుత్ తీగలను సరి చేయడం జరుగుతుందని తెలిపారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను గుర్తించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తక్కువ ఎత్తులో ట్రాన్స్ ఫార్మర్ల దిమ్మెల ఎత్తును పెంచడం లేదా ఫిన్సింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలు, అంగన్వాడీ ప్రాంగణాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. వినియోగదారులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



పెద్దకడబూరులో కరెంటోళ్ల జనబాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# టీడీపీ ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు పంపిణీ

**పెద్దకడబూరు, డిసెంబర్ 30 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలకు మంగళవారం మాధవరంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఉత్తమ కార్యకర్త ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో సేవలు అందించిన టీడీపీ కార్యకర్తలకు మంత్రి నారా లోకేష్ ఉత్తమ కార్యకర్తలుగా ప్రశంసా పత్రాలను పంపినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ కుట్రలతో దుష్ప్రచారం చేస్తుందని, వైసీపీ దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనేత రాకేష్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.




టీడీపీ ఉత్తమ కార్యకర్తలుగా ప్రశంసా పత్రాలు అందజేస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి



టీడీపీ ఉత్తమ కార్యకర్తలుగా ప్రశంసా పత్రాలు అందజేస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి

## వైభవంగా వైకుంఠ ఏకాదశి

**కౌతాళం, డిసెంబర్ 30:**
మండలం కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు .



వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ



కౌతాళం వెంకటేశ్వర స్వామి దేవాలయం. వెంకటేశ్వర స్వామికి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

## నేడు సమన్వయ సమావేశం

**రోళ్ల, డిసెంబర్ 30 :**
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు ఉపాధి సిబ్బంది మరియు అనుబంధ శాఖల అధికారిల తో సమన్వయ సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ నాగేశ్వరావు ఎ పి ఓ ఓబుళప్ప తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 2024-25 ఆర్థిక సం. లో జరిగిన పనులకు సంబందించి 19 వ విడత సామాజిక తనిఖీ బృందం వారు కోఆర్డినేషన్ మీటింగ్ ఉపాధి సిబ్బంది అనుబంధ శాఖల అధికారులు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేశామన్నారు. సంబంధిత అధికారులు హాజరుకావాలని తెలియజేశారు.

## టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మను కలిసిన టీడీపీ నేతలు

**పెద్దకడబూరు, డిసెంబర్ 30 :**
టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మను ఆదోని పట్టణంలో పెద్దకడబూరు మండల పరిధిలోని నౌలేకల్ గ్రామ టీడీపీ యువ నాయకులు రాజు, శాంతప్ప మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దకడబూరు మండలంలోని రాజకీయ పరిస్థితులను వివరించారు. టీడీపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గుడిసె కృష్ణమ్మ దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని హితవు పలికారు.



టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మను కలిసిన టీడీపీ యువనేతలు

## పొదిలి ఘటనపై బాధ్యులపై చర్యలకు సీఎం ఆదేశాలు

**అమరావతి, డిసెంబర్ 30 :**
ప్రకాశం జిల్లా పొదిలి పట్టణంలో స్థానిక వ్యాపారికి, పోలీసులకు జరిగిన ఘర్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. స్థానిక ఎస్ఐ అకారణంగా దాడి చేశారనే వ్యాపారుల ఆరోపణపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే... పొదిలి పట్టణంలో అవినాష్ అనే వ్యాపారికి, పట్టణ ఎస్సై వేమనకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5 గంటల సమయంలో షాప్ వద్ద లారీ నుంచి ఎరువులను అన్లోడ్ చేసే క్రమంలో వెంటనే లారీని అక్కడ నుంచి తొలగించాలని పోలీసులు కోరిన సందర్భంలో వివాదం రేగింది. తరువాత రోజు క్రిస్మస్ పండగ సందర్భంగా రోడ్లపై రద్దీ కారణంగా ట్రాఫిక్ ను క్లియర్ చేసే క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంలో తమపై లాఠీతో దాడి చేశారని అవినాష్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఎస్ఐపై ఆరోపించారు. దీనిపై వ్యాపార వర్గాలు తీవ్ర అభ్యంతరం వక్తం చేస్తూ ఆందోళన చేయడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాయి. ఘటనపై ప్రాథమిక విచారణ జరిపిన జిల్లా ఎస్పీ ఎస్ఐ వేమనను విఆర్ కు పంపుతూ రెండు రోజుల క్రితం ఆదేశాలు ఇచ్చారు. ఘర్షణకు కారణాలు, పోలీసుల చర్యలు, వ్యాపార వర్గాల ఆందోళనపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంమంత్రి అనితతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఘటనపై ఇప్పటికే మంత్రులు, అధికారులు స్పందించారని వివరించారు. సదరు పోలీసు సబ్ ఇన్ స్పెక్టర్ కు ముందుగా ఛార్జ్ మోమో ఇచ్చి వివరణ తీసుకున్నామని, ప్రాథమిక నివేదిక ఆధారంగా ఎస్ఐ వేమనను విఆర్ కు పంపామని డీజీపీ వివరించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని, సాధారణ ప్రజల పట్ల వ్యవహరించే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.



శ్రీశైలంలో ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

# చెంచు గిరిజనులకు ఉచిత స్పర్శదర్శనం

**శ్రీశైలం, డిసెంబర్ 30:**
శ్రీశైలం మహా క్షేత్రంలో నెలలో ఒకరోజు చెంచు గిరిజన భక్తులకు ఉచితంగా శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పించాలనే సదుద్దేశంతో ధర్మకర్తల మండలి సభ్యులు తీసుకున్న నిర్ణయం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రారంభ ప్రారంభించారు.ర్శనానంతరం చెంచు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. దేవస్థానం కల్పించిన అవకాశం పట్ల చెంచు గిరిజనలు హర్షం వ్యక్తం చేశారు. ప్రతినెల ఒకరోజున చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. మంగళవారం ఉదయం చెంచు గిరిజన భక్తులు సంప్రదాయబద్దంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారియం. శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు వారికి ఆహ్వానం పలికారు చెంచు భక్తులందరు కూడా ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణను చేశారు. అనంతరం ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారి వారికి శ్రీస్వామివారి స్పర్శదర్శనం, అమ్మవారి దర్శనాలను చేయించారు.

అనంతరం అన్నప్రసాదవితరణ భవనములో చెంచు భక్తులందరికీ కూడా అన్నప్రసాదాలన ఏర్పాటు చేయడం జరిగింది ధర్మకర్తలమండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారి కూడా చెంచు భక్తులతో అన్నప్రసాదాన్ని స్వీకరించారుస్థానిక మేకలబండ గిరిజనులతో పాటు పలు ఇతర గూడెములకు చెందిన చెంచు భక్తులకు కూడా ఈ రోజు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారుఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులుపోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ తాము పదవీబాధ్యతలను స్వీకరించిన వెంటనే స్థానిక మేకలబండ చెంచుగూడెములను సందర్శించానన్నారు. ఆ సందర్భంలో చెంచు భక్తులు తమకు స్వామివారి స్పర్శదర్శనాన్ని కల్పించవలసినదిగా కోరడం జరిగిందన్నారు. తదనుగుణంగా ధర్మకర్తల మండలి సమావేశంలో చెంచుభక్తులకు నెలలో ఒకరోజున ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించాలని ధర్మకర్తల మండలి సమావేశములో తీర్మానించామన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. శ్రీశైలక్షేత్ర సంస్కృతీ సంప్రదాయాలలో చెంచు భక్తులకు ఎంతో ప్రత్యేక స్థానము ఉందన్నారు.



ఉచిత స్పర్శ దర్శనానికి వెళ్తున్న చెంచు గిరిజనులు

కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ చెంచు భక్తులు శ్రీ భ్రమరాంబాదేవివారిని తమ కూతురిగా,మల్లికార్జునస్వామివారిని తమ అల్లునిడిగా భావిస్తారన్నారు. దేవస్థానంలో జరిగే ఆయా ఉత్సవాలలో గ్రామోత్సవం నందు ప్రత్యేకంగా చెంచుల సంప్రదాయ నృత్యాలను దేవస్థానం ఏర్పాటు చేయడం జరుగుతున్నదన్నారు. అలాగే ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో జరిగే సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో చెంచులను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరుగుతోందన్నారు. ఇటీవల కార్తికమాసంలో జరిగిన కోటీదీపోత్సవ కార్యక్రమంలో కూడా గిరిజన చెంచు మహిళలను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందన్నారు. శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి సహకారంతీసుకుంటున్నామన్నారు. కార్యక్రమములో పాల్గొన్న స్థానిక మేకలబండకు చెందిన ధర్మకర్తల మండలి సభ్యురాలు జి. గంగమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ధర్మకర్తల మండలి మరియు దేవస్థానం అధికారులు చెంచులకు కల్పించిన అవకాశం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్థానిక చెంచు భక్తుల పూర్వీకులందరు కూడా క్షేత్రానికి ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా పలువురు చెంచు భక్తులు తమకు కల్పించిన ఈ అవకాశం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.



అన్నదానం స్వీకరిస్తున్న చెంచె గిరిజనులు, అలయ అధికారులు

# శ్రీశైలంలో సంప్రదాయబద్ధంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవం

**శ్రీశైలం, డిసెంబర్ 30:**
శ్రీశైల మహా క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజాదికాలు, రావణవాహనసేవ నిర్వహించబడ్డాయి. ఉదయం 3 గంటలకు ఆలయద్వారాలను తెరచి మంగళవాయిద్యాలు, స్వామివారికి సుప్రభాత సేవ , స్వామిఅమ్మవార్లకు ప్రాత:కాల పూజలు జరిపించారు. ఆ తరువాత స్వామి, అమ్మవారికి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండపంలో ఉత్తర ముఖంగా వేంచేయించి విశేష పూజాదికాలను జరిపించి లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఉత్సవసంకల్పాన్ని పఠించారు. ఈ ఉత్సవ సంకల్పంలో దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, దేశంలో సుఖశాంతులు విలసిల్లాలని, జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని, ప్రమాదాలు, అకాల మరణాలు సంభవించకుండా ఉండాలని చెప్పబడింది. అనంతరం ఉత్సవపూజాదికాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజాదికాలు జరిపించబడ్డాయి.ఈ ఉత్సవంలో భాగంగానే ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తర ద్వారం నుండి వెలుపలకు తోడ్కొనివచ్చి ఆలయ ఉత్తరభాగంలోనే రావణవాహనంపై ఆశీనులను చేయించి రావణవాహనసేవ రావణవాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉత్తరద్వారమైన శివాజీగోపురం నుంచి వెలుపలకు తీసుకువచ్చి గ్రామోత్సవం నిర్వహించారు సంవత్సరంలో రెండు పర్యాయాలు మాత్రమే ఉత్తరద్వారమైన శివాజీగోపురం నుంచి గ్రామోత్సవానికి తరలివెళ్ళడం విశేషం. ముక్కోటి ఏకాదశి రోజున



మరియు శివముక్కోటి రోజున (వార్షిక ఆరుద్రోత్సవం రోజున) ఈ విధంగా శ్రీస్వామిఅమ్మవార్లు ఆలయ ఉత్తరద్వారం నుంచి గ్రామోత్సవానికి తోడుకొని వెళ్లారు . గ్రామోత్సవం తరువాత భక్తులు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు వీలుగా ఉత్సవమూర్తులను ఆలయ ముఖమండపం ఉత్తరం వైపున వేంచేబు చేయించడం జరిగింది

శ్రీ స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం ప్రారంభమైన తరువాత భక్తులను దర్శనానికి, ఆర్జితసేవలకు అనుమతించారు. ఈ ఉత్సవంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, శ్రీస్వామివార్ల ప్రధానార్చకులు కె.శివప్రసాద్‌స్వామి, స్థానాచార్యులఎం. పూర్ణానంద ఆరాధ్యులు, సీనియర్ వేదపండితులు గంటి రాధకృష్ణశర్మ, సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు, పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చక స్వాములు



## నేటి నుంచే పింఛన్ల పంపిణీ

**7,140 మంది లబ్ధిదారులకు రూ. 3.04 కోట్లు.. ఎంపీడీవో సుబ్బారెడ్డి**

**దువ్వూరు, డిసెంబర్ 30:**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దువ్వూరు మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒకరోజు ముందుగానే ప్రారంభం కానుంది. ఈ మేరకు మండల అభివృద్ధి అధికారి జె. సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం నుంచే లబ్ధిదారుల ముంగిటకు పింఛన్ సొమ్ము చేరనుంది. మండలంలోని మొత్తం 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 7,140 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఇందులో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరియు ఇతర కేటగిరీల లబ్ధిదారులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం మొత్తం 3 కోట్ల 4 లక్షల 80 వేల రూపాయలను విడుదల చేసింది. పింఛన్ల పంపిణీ కోసం మండల వ్యాప్తంగా 134 మంది సచివాలయ సిబ్బందిని కేటాయించారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్మును అందజేస్తారని ఎంపీడీవో వివరించారు. ?"పింఛన్ దారులు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. అందరూ తమ ఇళ్ల వద్దే అందుబాటులో ఉండి పింఛన్ సొమ్మును తీసుకోవాలి. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తాం" అని ఎంపీడీవో జె. సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

# వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

## ఉత్తరద్వారం గుండాస్వామివారి దర్శనం..

**దువ్వూరు, డిసెంబర్ 30:**
దువ్వూరు మండలవ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ప్రధాన ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయాల వద్ద బారులు తీరారు.

***ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లిన ఆలయాలు..***
మండలంలోని గుడిపాడు గ్రామములోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, పాత దువ్వూరు లోని శ్రీ కోదండ రామస్వామి ఆలయం, మరియు పెద్ద జొన్నవరం గ్రామంలోని శ్రీరామ దేవాలయాలు ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లాయి. పవిత్ర ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేచి ఉండటంతో ఆలయ ప్రాంగణాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి.

***గుడిపాడులో అంగరంగ వైభవంగా స్వామివారి కళ్యాణం..***
?గుడిపాడు గ్రామ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ కళ్యాణ వేడుక భక్తులకు కనువిందు చేసింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మాట్లాడుతూ.. ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశులలో ముక్కోటి ఏకాదశి ఎంతో విశిష్టమైనది. ఈ రోజున మూడు కోట్ల మంది దేవతలు భూమికి దిగివచ్చి విష్ణుమూర్తిని దర్శించుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అందుకే దీనిని ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ రోజున ఉపవాసం ఉండి, విష్ణు సహస్రనామ పారాయణ చేస్తూ ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి మోక్షం సిద్ధిస్తుంది" అని వారు వివరించారు. అనంతరం అన్ని దేవాలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి


ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


మృతుని కుటుంబాలనికి చెక్కు అందిస్తున్న దృశ్యం

## ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం

**బద్వేల్, డిసెంబర్ 30:**
ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా గోపవరం మండలం, రామాపురం పంచాయతీ, గ్రామం రేకలకుంటలో సామాజిక భద్రత పథకాలు పిఎంఎస్‌బివై, పిఎంజెజెబివై, ఎపివై, పిఎంజెడివై, ఈ కెవైసి, ఫ్రాడ్స్, డీ ఫండ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిజిబి మేనేజర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు, ఇన్సూరెన్సు ఉపయోగాలు ,పెన్షన్ ,ఆన్లైన్ మోసాలు గురించి తెలియజేస్తూ ఇన్సూరెన్సు లేని వారికి బ్యాంక్ లో కానీ ,ఆర్థిక అక్షరాస్యత కేంద్రం లో గాని ఇన్సూరెన్సు చేసుకోవచ్చని తెలిపారు, ఇన్సూరెన్సు పథకంలో ఇదివరకే చేరిన పొత్తపి శివయ్య అనారోగ్యంతో మరణించడతో జీవిత భాగస్వామి పొత్తపి పద్మకు ఇన్సూరెన్సు మొత్తం రూ.2,00,000 చెక్ అందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సత్తార్ జస్వంతు , సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు శిద్దారెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ముగిసిన స్వామివారి తిరుకళ్యాణ మహోత్సవం

**బద్వేల్, డిసెంబర్ 30:**
బద్వేల్ నియోజకవర్గం గోపవరం మండలం వల్లేర వారి పల్లె గ్రామంలో వెలిసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనము స్వామి వారికి జిలేబి,అత్తారాలు,పలుస్వీట్లతో ప్రత్యేక అలంకరణ లో స్వామి అమ్మ వారు వచ్చిన భక్తులకు దర్శనం ఇచ్చారు తదుపరి స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తిరు కల్యాణాన్ని తిలకించారు. కళ్యాణ అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు,కళ్యాణం కైంకర్యం నిర్వహించిన వారు మడకల వారి పల్లె గ్రామానికి చెందిన కొండ్రెడ్డి జయసుబ్బారెడ్డి ధర్మపత్ని అరుణ వీరి కుటుంబ సభ్యులు అన్న ప్రసాద కైంకర్యం నిర్వహించినవారు. క్రీ"శే "బెల్లం రామిరెడ్డి ధర్మపత్ని సుబ్బమ్మ వీరి కుటుంబ సభ్యులు స్వామి వారి కళ్యాణం తిలకించుటకు బద్వేల్ పట్టణంలో ఉన్నటువంటి పలువురు ప్రముఖ డాక్టర్లు %స్త్రజన% హాస్పిటల్ అధినేత డాక్టర్ గోపాలకృష్ణయ్య ,లక్ష్మీదేవి హాస్పిటల్ అధినేత %సతీ%. రాంప్రతాపరెడ్డి ధర్మపత్ని %సతీ%.లక్ష్మీదేవి గార్లు మరియు పలువరు వ్యాపారవేత్తలు,రాజకీయ నాయకులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.


స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న భక్తులు


ముక్కోటి ఏకాదశి వేడుకలకు హాజరైన భక్తులు


మండల జనసేన నాయకులకు క్యాలెండర్, తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

## నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు

**పాతపట్నం జనసేన నాయకురాలు కొరికాన.భవాని**

**హిరమండలం డిసెంబర్ 30:**
నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు పాతపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకురాలు కొరికాన.భవాని తెలియజేశారు.మంగళవారం నియోజకవర్గం పరిధిలోని ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచలకు నూతన సంవత్సరం సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేసి క్యాలెండర్లు,తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదం హిరమండలం మండల జనసేన నాయకులు గోళ్ళ. తిరుపతిరావు వరపల యోగేశ్వరరావు క్రియాశీలక సభ్యులు అందజేశారు.ఈ కార్యక్రమం లో సైలాడా గంగాధర్ రావు రావాడ బాలకృష్ణ పాండురంగి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల సర్వేయర్ శ్రీనివాసులు

## రీ సర్వే సమస్యలకు గ్రామ సభల ద్వారా పరిష్కారం

**అట్లూరు, డిసెంబర్ 30:**
అట్లూరు మండలం రెడ్డిపల్లి, అట్లూరు గ్రామ సచివాలయ పరిధిలో అట్లూరు గ్రామంలో మంగళవారం రీ సర్వే గ్రామ సభపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రీ సర్వే గ్రామ సభ కు ప్రజలు అందరూ తరలిరావాలని కోరారు. రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అలాగే గ్రామ సభల ద్వారా కూడా భూ సమస్యల ను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, అట్లూరు వీఆర్వో నాని, సచివాలయ సర్వేయర్లు నరేష్, వినయ్, రామచంద్ర, సందీప్ సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజలు, రైతులు, పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షులుగా అశోక్‌రెడ్డి



**బద్వేల్, డిసెంబర్ 30:**
తనపై నమ్మకం ఉంచి భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షులుగా నియమించిన నేతలకు అశోక్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వంగళ శశిభూషణ్ రెడ్డి , ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదరి దయాకర్ రెడ్డి, , కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుమార స్వామి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి , బిజెపి కుటుంబ సబ్యులు అందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

## వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు ..

**హిరమండలం, డిసెంబర్ 30:**
ముక్కోటి ఏకాదశి పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి.హిరమండలం అంగూరు వీధిలో కొలువుదీరిన శ్రీ శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు.వేకువ జాము నుండి ఉత్తర ద్వార దర్శనానికి భక్తజనం పోటెత్తారు.భక్తుల గోవిందా... గోవిందా నామస్మరణ తో మారు మోగాయి. ఆలయం యందు స్వామి వారి సుప్రభాత సేవ మూలవిరాట్ కు క్షీరాభిషేకం, పుష్పాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు.ఆలయ కమిటీ చైర్మన్ ప్రేమ మోహన్ శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.ఆలయ అర్చకులు గోపి నంబాల లక్ష్మాచారులు, శరత్ చంద్ర చారులు స్వామి వారి కి ప్రత్యేక పూజలు చేసి,భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.గరుడ వాహనం పై స్వామి వారిని తిరువీధి మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు.హిరమండలం, పరిసర గ్రామాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.వైష్ణవాలయాలు ఆద్యాత్మిక శోభ నెలకొన్నాయి.


స్వామి వారికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


అభిషేకం చేస్తున్న అర్చకులు తిరువీధి మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


జగన్నాథ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


## ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

**ఎల్ఎన్ పేట , డిసెంబర్ 30:**
ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు మంగళవారంనిర్వహించారు.లక్ష్మీనర్సుపేట గ్రామం లో జగన్నాథ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.ఉత్తర ద్వార మార్గం లో స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకున్నారు.భక్తుల గోవిందా... గోవిందా నామస్మరణ తో మారు మోగాయి.గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.ఆలయ అర్చకులు లక్ష్మీ నారాయణ పత్రి,వినోద్ కుమార్ పత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.అలాగే కోదండరామాలయ లో భక్తులు పూజలు చేశారు. వైష్ణవాలయాలు ఆద్యాత్మిక శోభ సంతరించుకన్నాయి

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు

*ఉత్తర ద్వార ప్రవేశం. .*

**అమరాపురం, డిసెంబర్ 30 :**
పావుగడ నియోజకవర్గం నిడుగల్లు కొండపై వెలసిన పుణ్యక్షేత్ర%శీ% శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి మంగళవారం తెల్లవారుజాము నుండి అర్చకులు హరీష్ బట్టర్ నిడుగల్లు శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అభిషేకం,, ప్రకారోత్సవం, కుంకుమార్చన, శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పూలతో అలంకరణ చేశారు. ఉత్తర ద్వారంలో భక్తులు ప్రవేశం చేశారు. తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.మహా మంగళ హారతి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు.


శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పూలతో అలంకరణ


ఉత్తర ద్వారంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి . శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఉత్తర ద్వారం ద్వారా భక్తులు ప్రవేశం చేస్తున్న దృశ్యం

# ఆదోని జిల్లా కోసం భజన కళాకారుల వినూత్న నిరసన

## భక్తి గీతాలు, దేవతా ప్రార్థనలతో సంఘీభావం..

**ఆదోని, డిసెంబర్ 30 :**
ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో గత 24 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో వివిధ సంఘాల నాయక్షులు పాల్గొని సంఘీభావం తెలుపుతునాష్ఠరు. అందులో భాగంగా 25వ రోజు మంగళవారం ఆదోని డివిజన్ భజన కళాకారుల సంఘం వారు తమ వంతు బాధ్యతగా భక్తి గీతాలు, వివిధ దేవతా ప్రార్థన గీతాలు పద్యాలు ఆలపిస్తూ రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ఆదోని గ్రామదేవత లక్ష్మమ్మ, ఉరుకుంద ఈరన్న స్వామి, రణమండల ఆంజనేయస్వామి, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి, వివిధ గ్రామ దేవతలను ప్రార్థిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. భగవద్గీత పఠించారు. పాలకుల మనసు మార్చి ఆదోని జిల్లా ఏర్పాటు చేసే విధంగా చేయాలని కోరారు. భక్తి గీతాలను వినేందుకు ప్రజలు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. దీక్షలకు రఘురామయ్య, కృష్ణమూర్తి ,దస్తగిరి, సుగుణమ్మ సంఘీభావం తెలిపారు. సీనియర్ జర్నలిస్టు ఈరన్న సంఘీభావం తెలిపారు. దీక్షల్లో భజన మండలి నల్లారెడ్డి, చిన్న లక్ష్మన్న, అంజప్ప, రామాంజనేయ స్వామి, మహేష్, జ్యోతి రెడ్డి, లక్ష్మన్న, హనుమాన్ సింగ్, రాజు సత్యనారాయణ స్వామి, రామచంద్ర, వెంకటేశ్వర స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లారెడ్డి మాట్లాడుతూ దీక్ష కొనసాగించి 45 రోజులైనా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. తొందరలోనే ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని ప్రజల అభిప్రాయంతో ఏకీభవించాలని కోరారు. లేనిపక్షంలో జరగబోయే ఎలక్షన్లలో పభుత్వానికి నష్టం జరగబోయే ప్రమాదం ఉందని అన్నారు. జిల్లా ఏర్పడేంతవరకు ఈ ఉద్యమం ఆపేదే లేదని కొనసాగించే తీరుతామని అన్నారు.


ఆదోని జిల్లా సాధన దీక్షలకు మద్దతుగా భక్తిగీతాలు ఆలపిస్తున్న కళాకారులు


ఆదోని జిల్లా సాధన దీక్షలకు మద్దతు తెలిపిన కళాకారులు



మాట్లాడుతున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక సభ్యులు

## అభివృద్ధిని కేంద్రీకరిస్తే ప్రతిఘటిస్తాం

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక హెచ్చరిక..

**అనంతపురం రూరల్, డిసెంబర్ 30:**

అభివృద్ధిని కేంద్రీకరిస్తే ప్రతిఘటిస్తామని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు హెచ్చరించారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వేదిక నాయకులు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధిగా ముందుకుపోతున్న కూటమి ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. రాష్ట్రంలోని అత్యంత వెనుకబడి ప్రాంతాల ప్రజల ప్రతిఘటనను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కేవలం 30వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడితే పూర్తి అయ్యే రాయలసీమ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి, గోదావరి- బనకచర్ల,గోదావరి- నల్లమల సాగర్, గోదావరి- కావేరి అంటూ సాధ్యం గాని ప్రకటనలు గుప్పిస్తూ, ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని,లక్ష కోట్లతో అమరావతిని నిర్మించడానికి లక్ష ఎకరాలు భూసేకరణ పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి,వీరు మాత్రం భూ దందాలు చేసుకొని కోట్లు గడిస్తున్నారన్నారు. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కలిగి,అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఈ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే 3850




విద్యార్థినులకు విద్యాసామగ్రి అందిస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

## తల్లిదండ్రులను గౌరవించాలి

**అనంతపురం రూరల్, డిసెంబర్ 30:**

ప్రతి విద్యార్థి మొదట తమ ఇంటిలో ఉన్న తల్లిదండ్రులను గౌరవించే విధానాన్ని తెలుసుకోవాలని నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్ శ్రీమతి డాక్టర్ .ఎస్. నిర్మలమురళి తెలిపారు. మంగళవారం ఆదిమూర్తినగర్‌లోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు విద్యాసామగ్రి అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ట్రస్ట్ సభ్యులు మళగవేలి లక్ష్మిరెడ్డి, శ్రీమతి అరుణ దంపతుల కుమారుడు అనీష్ పుట్టినరోజు సందర్భంగా పదిమంది విద్యార్థినులకు 20 రకాల విద్యాసామగ్రి, అలంకరణ సామగ్రి అందించారు. హాస్టల్ విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరుగుతున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని సమాజానికి తగ్గట్టుగా మలచుకోవాలన్నారు. జీవితం చాలా విలువైనదని, ప్రతిక్షణం భవిష్యత్తును గుర్తించుకొని అడుగులు వేయాలన్నారు. విద్యలో మంచి గుర్తింపు సాధించినప్పుడే విద్యార్థికి మంచి గుర్తింపు ఉంటుందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి సమాజంలో గౌరవ మర్యాదలతో తమకంటూ ఒక గుర్తింపును సాధించుకోవాలన్నారు. విద్యలో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారిని వై.మాధవి లత తదితరులు పాల్గొన్నారు

## ఎస్సీ,ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గుండ్లపల్లి లో పౌర హక్కుల దినోత్సవం..
తహసిల్దార్ అనిల్ కుమార్..

**బెళుగుప్ప, డిసెంబర్ 30 :**

ఎస్సీ, ఎస్టి చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆ చట్టాలను దుర్వినియోగం చేయరాదని తహసిల్దార్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బెళుగుప్ప మండలం పరిధిలోని గుండ్లపల్లి లో అధికారులు పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసిల్దార్ అనిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ వ్యక్తుల హక్కులను కాపాడటానికి, వివక్షను నిరోధించడానికి, ఈ చట్టాలను చేసినప్పటికీ దుర్వినియోగం చేయకుండా నిరోధించడం కూడా ముఖ్యమన్నారు. ఎస్సీ ఎస్టీల (అట్రాసిటీల నిరోధక చట్టం) 1989 షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలపై జరిగే దారుణాలను నిరోధించడానికి వారి హక్కులను రక్షించడానికి ఈ చట్టం రూపొందించబడిందన్నారు. ఎవరైనా అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయిస్తే, వారు న్యాయం చేస్తారన్నారు. గ్రామాల్లో వెట్టి చాకిరి, బాల కార్మికులను వేధిస్తుంటే, బాల్య వివాహాలను చేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో కక్షలకు ఘర్షణలకు పాల్పడకుండా ఉండాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అనిల్ కుమార్, ఎంఈఓ 2 హరికృష్ణ, విఆర్ఓ రమేష్, కానిస్టేబుల్ నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు..




మాట్లాడుతున్న తహసిల్దార్ అనిల్ కుమార్

## చింతల రాయుని దర్శించుకున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

**తాడిపత్రి, డిసెంబర్ 30:**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పునస్కరించుకొని మంగళవారం తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి శ్రీ చింతల వెంకటరమణ స్వామి దర్శించుకున్నారు. శ్రీ చింతల వెంకటరమణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిని ఆశీర్వదించారు.

**టిడ్కో గృహాలను పరిశీలించిన ఎమ్మెల్యే**

తాడిపత్రి రూరల్ పరిధిలోని టిడ్కో గృహాలను తాడిపత్రి శాసనసభ్యులు జెసి అస్మిత్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. తొందరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.



చింతల రాయునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి
టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

# కన్నుల పండువగా వైకుంఠ ఏకాదశి వేడుకలు


**ఓం నమో వేంకటేశాయ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు.. భక్తులతో కిటకిటలాడిన రంగనాథ స్వామి ఆలయం.. బెళుగుప్ప, బూదిగుమ్మ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో ప్రత్యేక అలంకరణ.. ఉత్తర ద్వార దర్శనంతో పులకించిన భక్తులు..**

**బెళుగుప్ప, డిసెంబర్ 30:**

బెళుగుప్ప మండలంలోని వివిధ గ్రామాలలో వెలసిన, శ్రీ రంగనాథస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో మంగళవారం ముక్కోటి,వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన బెళుగుప్ప లోని శ్రీ నగరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, బూదిగుమ్మ లో కొలువైన శ్రీ పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయాలలో వైకుంఠ ఏకాదశి ని పురస్కరించుకుని భక్తుల దర్శనార్థం ప్రత్యేకంగా ఉత్తరద్వారం ఏర్పాటు చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్ల కు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువజాము నుంచే భక్తులు ఉత్తరద్వారం గుండా వెళ్లి స్వామి,అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. ఓం నమో వెంకటేశాయ నామస్మరణంతో భక్తులు పులకించి పోయారు. స్వామివార్లను, ఆలయాలను వివిధ రకాల పూలతో ఎంతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులతో కిటకిటలాడిన శ్రీరంగాపురం శ్రీ రంగనాథస్వామి ఆలయం, బెళుగుప్ప మండలం పరిధిలోని శ్రీరంగాపురం లో వెలసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ రంగనాథ స్వామి ఆలయం. ఈ ఆలయానికి తూర్పు ద్వారం తో పాటు ఉత్తర ద్వారం కూడా ఉండటం విశేషం. అందువల్లనే వైకుంఠ ఏకాదశి రోజున ప్రతి ఏటా మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఉత్తర ద్వార దర్శనంతో వెళ్లి శ్రీ రంగనాథస్వామి వారిని దర్శించుకుంటారు. అందులో భాగంగా మంగళవారం వేకువజామునే ఆలయంలో వంశ పార్యంపర అర్చకులు శ్రీ రంగనాథ స్వామి మూలవిరాట్ కు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున శ్రీరంగపురం చేరుకుని శ్రీ రంగనాథ స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులు చెక్కభజన వేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంతో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



బూదిగుమ్మ శ్రీ పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



శ్రీరంగాపురంలో కొలువైన శ్రీ రంగనాథ స్వామికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు. ప్రత్యేక అలంకరణలో శ్రీ భూదేవి శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు. భక్తులతో కిటకిటలాడిన శ్రీరంగాపురం శ్రీ రంగనాథ స్వామి ఆలయం

# మోక్షదాయకం వైకుంఠద్వార దర్శనం

## గోవింద నామస్మరణతో మార్మోగిన అనంత ..

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 30:**

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని గోవింద నామస్మరణలతో అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలు మారుమోగాయి. పాతూరులోని అతి పురాతనమైన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం భక్తులు అర్ధరాత్రి నుండి బారులుతీరి చెన్నకేశవుని దర్శించుకుని పునీతులయ్యారు. దేవాదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఆర్ఎఫ్ రోడ్డు లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సప్త ద్వారాలను ఏర్పాటు చేసి వైకుంఠ ద్వారానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాటులకు తులసీదళాలతో వివిధ పుష్పమాలలతో నాయన మనోహరంగా అలంకరించారు. అనంతరం భక్తులు ద్వారము ద్వారా ప్రవేశించి సర్వాంగ సుందరంగా అలంకరించుకుని శ్రీ వేంకటేశ్వరుని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం వాహనం పై ఆశీనులై పుర ప్రజలకు సాక్షాత్కరించారు. హౌసింగ్ బోర్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో, గీతా మందిరంలో, వైకుంఠ ద్వారాలను ఏర్పాటు చేసి భక్తులు స్వామివారిని దర్శించుకునేలా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఒకటవ రోడ్డులోని శ్రీ కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో భక్తులు బారులుతీరి వైకుంఠ ద్వార ప్రవేశం చేశారు. శారదానగర్‌లోని శివ బాలయోగి ఆశ్రమంలో, కలెక్టరేట్ వద్ద ఉన్న గోశాలలో వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు ప్రతి ఆలయంలోనూ మూడు నామాల స్వామిని దర్శించుకొని గోవింద నామ స్మరణ చేస్తూ తన్మయత్వం నొందారు.





ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

## శ్రీ వేంకటేశ్వరుని సేవలో మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబం

**తిరుమల, డిసెంబర్ 30 :**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు కుటుంబ సమేతంగా కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఉత్తర ద్వారా దివ్యదర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వామివారి అనుగ్రహంతో ప్రజలందరికి ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధి కలగాలని మనసారా కోరుకున్నామని తెలిపారు. ఈ రోజు స్వామి వారి దర్శన కలగడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పవిత్ర సందర్భంగా వైకుంఠ ఏకాదశి పవిత్రత ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సద్గుణాలు, ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.



# వైభవంగా ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు

## వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు..

**యాడికి , డిసెంబర్ 30:**

యాడికి మండల కేంద్రంలోని పురాతన ప్రసిద్ధి గాంచిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మంగళవారం అంగరంగ వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి అలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శనం కోసం తెల్లవారుజాము నుండే భక్తులు భారీ ఎత్తున వచ్చి. గోవింద నామస్మరణతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజామున 3 గంటలకు అర్చకులు ఆలయ ప్రధాన ద్వారాలు తెరిచారు. శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశిని పునస్కరించుకొని సుప్రభాత సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఉత్తర ద్వార ముఖంగా కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకొని తూర్పు ద్వారం నుండి భక్తులకు వెళ్లారు. పక్కనే అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహాల లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణంలో ఉన్న తూర్పు ముఖంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు పూజా కార్యక్రమంలో వైసిపి నాయకుడు బొంబాయి రమేష్ నాయుడు. ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.



శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి ప్రత్యేక అలంకారం.



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న పవన్ కుమార్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న బొంబాయి రమేష్ నాయుడు



యాడికిలో శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద క్యూ కట్టిన భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ సోమ నీలకంఠ, గురువులను సత్కరిస్తున్న గంగవరం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు, హిందూ సమ్మేళనంలో పాల్గొన్న విచ్చేసిన హిందూ బంధువులు

## హిందూ ధర్మాలను పిల్లలకు నేర్పించాల్సిన బాధ్యత

# తల్లిదండ్రులు, గురువులదే

### భారతం,భగవద్గీతలను మరిచారు... ముఖ్య అతిథులు శ్రీ గురుసేవానంద స్వామి.. ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ సోమ నీలకంఠ.. గంగవరంలో వైభవంగా హిందూ సమ్మేళనం..

**బెళుగుప్ప, డిసెంబర్ 30 :**
పిల్లల్లో హిందూ సనాతన ధర్మాన్ని గురించి తెలియ చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులదేనని శ్రీ గురు సేవానంద స్వాములు పేర్కొన్నారు. మంగళవారం బెళుగుప్ప మండలం లోని గంగవరంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలపాడు శ్రీ గురు సేవానంద స్వాములు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ఎస్ ) జిల్లా కార్యవాహ సోమ నీలకంఠ పాల్గొన్నారు. మొదట యువకులు జైశ్రీరామ్ నామస్మరణంతో గంగవరం లోని పురవీధుల గూండా మోటర్ బైకుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు శ్రీ గురు సేవానంద స్వాములు, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ సోమా నీలకంఠ లను హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు, గ్రామస్తులు భజనలతో సీతారామస్వామి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం వద్దకు ఘన స్వాగతం పలికారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, భరతమాత, శ్రీరాముడు, చత్రపతి శివాజీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్య అతిథులు శ్రీ గురుసేవానంద స్వామి మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరు పూర్వం నుంచి వస్తున్న హిందూ సాంప్రదాయాలు, కట్టుబాట్లను మర్చిపోతున్నారన్నారు. నేటి పిల్లలు తల్లిదండ్రులకు నమస్కారం చేయడం నామోషీగా అయిపోయిందన్నారు. భగవద్గీతను అధ్యయనం చేయాలని, భారత, భాగవతములను చదవాలని అందులో ఉన్న ధర్మాన్ని, పరమార్ధాన్ని,నీతిని, పిల్లలకు తెలియ చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ఎస్ ) జిల్లా కార్యవాహ సోమా నీలకంఠ మాట్లాడుతూ దేశంలో ఉన్న హిందువులను చైతన్యవంతుల్ని చేయడం కోసం ఈ దేశ హిందువులని సంఘటితం చేయడం కోసం,ఈ దేశ హిందువులు తన హిందుత్వాన్ని మరిచిపోకుండా హిందువుగా జీవించేటువంటి ఒక ఆలోచనను ప్రపంచానికి అందించేటువంటి దేశంగా నిలబెట్టడం కోసమే ఈ సంస్థ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ఇదే ప్రయాణాన్ని కొనసాగించిందన్నారు. 2025 నాటికి ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా హిందూ సమ్మేళనం వైభవంగా నిర్వహించాలని, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నిర్ణయిస్తూ, కుటుంబ వ్యవస్థ దేవాలయ వ్యవస్థ సామాజిక సమరసతతో మనమంతా హిందువులం బంధువులం అనే ఆత్మవిశ్వాసాన్ని నిర్మాణం చేయడమే హిందూ సమ్మేళనం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అనేక దేశాలు మన దేశంపై దాడి చేసినప్పటికీ 2025 నాటికి కూడా గొప్ప దేశంగా ఎదుగుతూ ప్రపంచంలోనే సమర్ధవంతమైన దేశంగా భారత్ నిలబడుతుందన్నారు. చివరిగా ముఖ్య అతిథులు శ్రీ గురు సేవానంద స్వాములు, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ సోమ నీలకంఠ లను గంగవరం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి విచ్చేసిన వారికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున హిందూ బంధువులు పాల్గొన్నారు..



గంగవరం హిందూ సమ్మేళనం సమావేశంలో మాట్లాడుతున్న శ్రీ గురు సేవానంద స్వాములు



## తిరుమల శ్రీ వేంకటేశ్వరుని సేవలో బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబం

**తిరుమల, డిసెంబర్ 30 :**
వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సమేతంగా ఈ రోజు ఉదయం తిరుమలలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దివ్యదర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడిన విష్ణువర్ధన్ రెడ్డి, స్వామివారి అనుగ్రహంతో ఈ పవిత్ర రోజున ప్రత్యేక దర్శనం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ముక్కోటి దేవతలు శ్రీ మహావిష్ణువుని దర్శించుకునే అత్యంత పవిత్రమైన రోజుగా వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కోటి పుణ్యాలకు నెలవైన ముక్కోటి ఏకాదశి సందర్భంగా కలియుగ వైకుంఠమైన తిరుమలలో వైకుంఠ ద్వారం ద్వారా వేకువజామున కుటుంబ సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పవిత్ర వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సద్గుణాలు, ఆధ్యాత్మిక ఉత్సాహం నిండి ఉండాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నానని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. తిరుమలలో శ్రీవారి ఆలయం ముందు అలంకరణ, ఇతర భక్తులకు సౌకర్యాలు, చాలా ప్రత్యేకంగా చేశారని, తిరుమల అధికారులకు, సిబ్బందికి, పాలక మండలికి ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు.



## సమన్వయ లోపంతో దుర్గగుడిలో విద్యుత్ అంతరాయం

*ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్*

**మంగళగిరి, డిసెంబర్ 30:**
విజయవాడ దుర్గగుడిలో విద్యుత్ అంతరాయం అంశాన్ని కొందరు రాజకీయం చేయడం దురదృష్టకరమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం నాడు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో సుమారు 15 నిమిషాల పాటు విద్యుత్ అంతరాయం కలగడానికి గల కారణాలపై దేవాదాయ, విద్యుత్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. విద్యుత్ అంతరాయం విషయం తన దృష్టికి రాగానే... యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరిచామని వెల్లడించారు. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్లే దుర్గ గుడిలో కరెంట్ సరఫరా నిలిచి పోయిందన్నారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యుల మీద చర్యలు తీసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. భక్తుల మనోభావాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి గొట్టిపాటి ఉద్ఘాటించారు. జనవరి 6,7 తేదీలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి దుర్గ గుడి ఈవో, ముఖ్య అధికారులతో కలిసి సమావేశం కానున్నట్లు మంత్రి గొట్టిపాటి ప్రకటించారు. సమన్వయ లోపం వల్ల జరిగిన ఈ చిన్న పొరపాటును పట్టుకొని రాజకీయ విమర్శలు చేయడం తగదని మంత్రి గొట్టిపాటి హితవు పలికారు. ప్రతీ చిన్న విషయాన్ని కూడా రాజకీయ అవసరాలకు వినియోగించుకోవడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. సనాతన ధర్మానికి మాత్రమే కాకుండా ఏ ధర్మానికైనా.. కూటమి ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడం ఎంతో సంతోషదాయకమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ.. జిల్లాల పునర్విభజన జరిగిందన్నారు. పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం కందుకూరు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపినట్లు పేర్కొన్నారు. 2012 నుంచి అద్దంకి రెవెన్యూ డివిజన్ కోసం పోరాడుతుండగా... కూటమి ప్రభుత్వంలో సాకారమైనట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.

## బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిది

### పాత తహసిల్దార్ కార్యాలయంలోకి ఐసిడిఎస్ కార్యాలయం.. అంగన్వాడీ కార్యకర్తలకు 5జి స్మార్ట్ ఫోన్లు.. పిడి అరుణ కుమారి. టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున..

**బెళుగుప్ప, డిసెంబర్ 30:**
గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పీడి అరుణ కుమారి,టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బెళుగుప్ప శ్రీ ఎర్రితాత దేవాలయ ప్రాంగణంలో అంగన్వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిడి అరుణకుమారి, టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ గ్రామాల్లో కొంతమంది నిరక్షరాస్యత, అవగాహన లోపంతో బాల్య వివాహాలు చేస్తున్నారని, బాల్యవివాహాలతో ఆడ, మగ ఇద్దరికీ చాలా కష్టాలు ఎదురవుతాయన్నారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, వాటిని తక్షణమే నిలిపివేసి, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే బాల్యవివాహాలను అరికట్టాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వము బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ గా మార్చాలన్న ఉద్దేశంతోనే 100 రోజుల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే ముఖ్యంగా అంగన్వాడి అధికారులకు కార్యకర్తలకు కార్యాలయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకుని వెళ్లి, పాత తహసిల్దార్ కార్యాలయాన్ని అంగన్వాడి అధికారుల కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి కృషిచేసిన టిడిపి నాయకుల మల్లికార్జున, పెద్ద తిప్పయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం నూతనంగా 5జీ స్మార్ట్ ఫోన్ లను అందించిందని, దీంతో వివిధ రకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం 5జి స్మార్ట్ ఫోన్ లను అంగన్వాడీ కార్యకర్తలకు అందజేశారు. తరువాత అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పిడి అరుణకుమారి,టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున, సిడిపిఓ శ్రీదేవి, సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న టిడిపి జిల్లా నాయకులు మల్లికార్జున, చిత్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పిడి అరుణకుమారి సిడిపిఓ శ్రీదేవి సూపర్వైజర్ రమాదేవి



ప్రభుత్వం అందించిన 5జి స్మార్ట్ మొబైల్ ఫోన్లు చూపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు. అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేయిస్తున్న పీడీ అరుణకుమారి, టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున, సిడిపిఓ శ్రీదేవి, సూపర్వైజర్ రమాదేవి

## అవరోధాలను అవకాశాలుగా మల్చటం సీఎం చంద్రబాబుకే సాధ్యం

*టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, ఎంపీ కేశినేని శివనాథ్*

**విజయవాడ, డిసెంబర్ 30:**
అవరోధాల నుంచి అవకాశాలను వెతుక్కునే వారిలో చంద్రబాబు నాయుడు ముందుంటారు. అలా అవకాశాలు సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించటం సీఎం చంద్రబాబు కే సాధ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. ఏడాదిన్నర కాలంలో ఎన్డీయే కూటమి సాధించిన విజయాలపై ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ షిబ్లీ, రాష్ట్ర ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ సావల దేవదత్, రాష్ట్ర బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల. రఘు రామరాజు, రాష్ట్ర నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, రాష్ట్ర సామాజిక సంక్షేమ మండలి చైర్మన్ పోతుల బాల కోటయ్య పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముందు టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు , దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన గద్దె అనురాధ, ప్రధానకార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏడాదిన్నర పూర్తయ్యే లోపు సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలు సూపర్ హిట్ చేసి చూపిందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అనే పలకరింపు, అభినందనలు ప్రజలు నంచి వస్తున్నాయన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10, 090 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ఆగస్టు 15 నుంచి ప్రారంభించగా ఇప్పటి వరకు అయిన వ్యయం రూ.1.444 కోట్లు కాగా, 3.25 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...ఎక్కడైనా పింఛను తీసుకునే సౌకర్యం కల్పించటం జరిగిందన్నారు. అన్నదాత సుఖీ భవ పథకం ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.6.310 కోట్లు రైతుల ఖాతాల జమ చేయటం జరిగిందన్నారు. ఇలా పెన్షన్స్ , ఉచిత గ్యాస్ సిలిండర్స్ , ఇమామ్ , మౌజమ్స్, పాస్టర్స్ కి , డ్రైవర్లకు పదిహేనువేలు , గీతకార్మికులకు సహాయం ఇలా ఎన్నో చేసినట్లు వివరించారు.


ముఖ్యమంత్రి తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ ద్వారా 15 వేల 941 టీచర్ల పోస్టుల భర్తీ అయ్యాయని, 5,757 కానిస్టేబుల్ పోస్టులు నియమాకం కూడా పూర్తి చేయటం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకువచ్చి దాదాపు ఎనిమిదిలక్షల ఉద్యోగాలు సాధించేలా ముందడుగు వేయటం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి గా చంద్రబాబు కలకలంగా వుండాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం హడావుడిగా నిర్ణయాలు తీసుకోదని, జనగణన పూర్తి అయిన తర్వాత గ్రేటర్ విజయవాడ పై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. గ్రేటర్ విజయవాడ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని స్పష్టంచేశారు.

గద్దె అనురాధ మాట్లాడుతూ గత ప్రభుత్వం విధ్వంసం వైపు రాష్ట్రాన్ని తీసుకువెళ్లితే సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వికాసం నడుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి సహించలేక వైకాపా నాయకులు మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వం పేదలకు అన్నం పెట్టే అన్నక్యాంటీన్లు మూసివేస్తే....ఎన్డీయే కూటమి అధికారంలో వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఒక అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్ర ఖజనాను ఖాళీ చేసిందని అయినా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లటం జరుగుతుందన్నారు. రైతులను ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం పంటను కొనుగోలు చేసి రైతుల ఖాతాలో నగదు జమ చేయటం జరుగుతోందన్నారు. రాబోయే సంక్రాంతి రైతులకు నిజమైన సంక్రాంతి పండుగ అని తెలిపారు. టిడిపి ఎప్పుడు మహిళలకు పెద్ద పీట వేస్తోందన్నారు.

### కన్నుల పండుగగా వైకుంఠ ఏకాదశి మహోత్సవ వేడుకలు.. పల్లకిలో స్వామివారి ఊరేగింపు .. కోలాటంతో సందడి..

**కనేకల్, డిసెంబర్ 30:**
ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలములో వైష్ణవ ఆలయాలు గోవింద నామస్మరణతో మంగళవారం మారు మ్రోగాయి.



పట్టణంలోని భూ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అలంకరణలతో కొలువుదీరిన స్వామి

## గోవింద నామస్మరణతో మార్మోగిన వైష్ణవ దేవాలయాలు

స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద ఉన్న శ్రీదేవి భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జాము నుండి స్వామివారికి, అమ్మవార్లకి ప్రత్యేక అలంకరణలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. దేవాలయాలను వివిధ రకాల పుష్పాలతో విద్యుత్ కాంతి తో సుందరంగా అలంకరించారు. అయ్యవారిని,అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తాదులు తెల్లవారుజాము నుండి క్యూ కట్టి అధిక సంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వారం దర్శనాలు చేసుకుని తమ మొక్కలను, కోరికలను ఆ దేవదేవుడు కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటపతి బాలాజీ ని తమ కోరికలు తీరాలని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాద వినియోగాలు భక్తులకు పూజారి విజయేంద్ర స్వామి వేణు స్వాములు ప్రసాదాలు అందించారు. అదేవిధంగా మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో వెంకటేశ్వర స్వామిని ప్రతిమను పల్లకిలో ఊరేగిస్తూ పురవీధుల గుండా మహిళలు కోలాటం ఆడుతూ గోవింద నామస్మరణ తో అలరించారు. కోలాటం బాలికలు ఎంతో ముచ్చటగా చేస్తుండడం అందరికీ సంతోషం కలిగించింది. వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవడం వల్ల స్వర్గ ప్రాప్తి లభిస్తుందని వేదాలు పురాణాలు చెబుతున్నాయి. భక్తులు ఉదయం తెల్లవారుజామునే లేచి స్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి స్వామివారిని స్మరిస్తూ ఉపవాసాలు చేపట్టారు. అదేవిధంగా మండల పరిధిలోని ఎర్రగుంట, సోల్లాపురం, గరుడచేడు, మీనహళ్లి,హనకన హాల్, గంగలాపురం,గజిగెర, జక్కులపడికి,43 ఉడేగోళం బ్రహ్మసముద్రం, బినేకల్, రచ్చ మట్టి, నాగేపల్లి తదితర గ్రామాలలో సైతం దేవాలయాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి.



హనుమాపురం గ్రామంలో అమ్మవార్లతో కొలువుదీరిన వెంకటేశ్వర స్వామి. కోలాటం ఆడుతున్న చిన్నారులు

## వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి, డిసెంబర్ 30:**
పుట్టపర్తి మండలం వెంకటగారి పల్లి గ్రామంలో వెలిసిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లె సింధూర కు అపూర్వ స్వాగతం పలికారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆలయ ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దేవాలయంలో ఎమ్మెల్యేకి పూజారులు మంత్రోచ్ఛరణాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవాలయ నిర్వాహకులు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అక్కడికి విచ్చేసిన భక్తులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సింగల్ విండో అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి పుల్లప్ప, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వెంకటేశ్వర స్వామికి
ప్రత్యేక పూలతో అలంకరణ
ప్రత్యేక అలంకరణలో ఏరి రంగనాథ స్వామి



శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మడకశిర బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ కుటుంబ సభ్యులు.
వైకుంఠ ఏకాదశి పూజలో పాల్గొన్న మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి, శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న మడకశిర మార్కెట్ డైరెక్టర్ డైరెక్టర్ రత్నశ్రీ

## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

### దర్శనానికి పోటెత్తిన భక్తులు.

**అగళి, డిసెంబర్ 30 :**
మండల వ్యాప్తంగా ఉన్న దేవాలయాలలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలను ఆయా గ్రామ ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.మండల కేంద్రంలోని ఏరి రంగనాథ స్వామి దేవాలయం, కన్యాకాపరమేశ్వరి దేవాలయం,ఎం ఎం పాళ్యం గ్రామం లో వెలసిన దత్తాత్రేయ స్వామి దేవాలయం, మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్యులు, ఏరి రంగనాథ స్వామి దేవాలయంలో బలిజ కులస్తులు గ్రామ ప్రజలు వైకుంఠ ఏకాదశి పండుగ సందర్భంగా వేకువజాము నుండే శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామికి అభిషేకం భజనలు దేవతల ప్రాకారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.అనంతరం మూలవిరాట్లను రంగురంగుల పూలతో అత్యంత సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళారతి నైవేద్యంతో ప్రసాదాలను పంపిణీ చేశారు.భక్తులు తండోప తండాలుగా పోటెత్తారు. అదేవిధంగా నరసంబూది లక్ష్మీ రంగనాథ దేవాలయంలో ఏకాదశి పండుగను పురస్కరించుకొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు వందలాది మంది భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు.పాల్గొన్న భక్తాదులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న ఫలహారం అందజేశారు.ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం సిరా పట్టణం నగరాభివృద్ధి సాధికార సదస్యులు సునీల్, నరసంబూది గోవిందరాజు, కార్యక్రమంలో పాల్గొని మండల కేంద్రంలోని ఏరి రంగనాథ స్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకలో ఆలయ మండలి సభ్యులు, అన్నదమ్ములు,కుల బాంధవ్యులు,భక్తులు,గ్రామ ప్రజలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆలయ మండల సభ్యులు భక్తులు

## వైభవంగా వైకుంఠ ఏకాదశి పూజలు

**అమరాపురం, డిసెంబర్ 30:**
అమరాపురంలో వెలసిన శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి, శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం నందు ముక్కోటి వైకుంఠ ఏకాదశి పూజలు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామికి మంగళవారం తెల్లవారుజాము నుండి ప్రత్యేకంగా పూజలు, అభిషేకం, కుంకుమార్చన, ప్రాకారోత్సవం ప్రధాన అర్చకులు శ్రీనిధి బట్టర్ నిర్వహించారు. శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కి పూలతో అలంకరణ చేశారు.. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవికి, శ్రీ విఘ్నేశ్వర స్వామికి ప్రధానార్చకులు హరీష్ బట్టర్,, అభిషేకం, కుంకుమార్చన, ప్రకారోత్సవం వివిధ రకాల పూజలు నిర్వహించారు పూలతో అలంకరణ చేశారు..ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయములో ఉత్తర ద్వారం నుండి స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయములో ఉత్తర ద్వారం నుండి భక్తులు దర్శించుకున్నారు.. మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడును తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పూజ కార్యక్రమంలో మడకశిర బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్ కుటుంబ సభ్యులు, మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి,. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రత్నశ్రీ చంద్రశేఖర్ గుప్తా, మాజీ ఎంపీపీ మీనాక్షి రామ్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వచ్చిన భక్తాదులందరికి ప్రసాదం అందజేశారు..కొత్తపాలెం గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.



శ్రీ విఘ్నేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు హరీష్ పట్టారు. భక్తులకు ప్రసాదం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు. వైకుంఠ ద్వారం వద్ద మహిళలు



శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి పూలతో అలంకరణ
శ్రీ కన్యకా పరమేశ్వరి దేవికి పూలతో అలంకరణ



శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద ఉత్తర ద్వారం ప్రవేశం చేస్తున్న మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి. శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఉత్తర ద్వారం ప్రవేశానికి వస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు. ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద భక్తుల రద్దీ

## ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

**అమరాపురం డిసెంబర్ 30:**
అమరాపురం దక్షిణ గొల్ల హట్టిలో వెలసిన బాలేనల్లి శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామి, శ్రీ ఎత్త లింగేశ్వర స్వామి, శ్రీ కాటలింగేశ్వర స్వామి, శ్రీ వేణుగోపాల రుక్మిణి సత్యభామ స్వామి దేవాలయాలలో మంగళవారం తెల్లవారుజాము నుండి అభిషేకం, విశేష పూజలు, కుంకుమార్చన, ప్రాకారోత్సవం పూజలు ఘనంగా అర్చకులు నరేష్ స్వామి, రాజప్ప స్వామి, కట్టప్ప స్వామి, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్తరాన ఉత్తర ద్వారము ఏర్పాటుచేసి వివిధ పూలతో స్వామివారిని అలంకరణ చేశారు. శ్రీ కృష్ణ యాదవ యువక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్తర ద్వారంలో ఉన్న స్వామిని దర్శించుకుని ద్వారా ప్రవేశం చేశారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తాదులకు అర్చకులు నరేష్ స్వామి, రాజప్ప స్వామి, కాటప్ప స్వామి, మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు.



శివ చిత్రలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు నరేష్ స్వామి



ఉత్తర ద్వారం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు నరేష్ స్వామి.
ఉత్తర ద్వార ప్రవేశం చేస్తున్న భక్తులు


## వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి భక్తుల అగ్నిగుండ ప్రవేశం

**అమరాపురం, డిసెంబర్ 30:**
మండల పరిధిలో వలస పంచాయితీ విరప సముద్రం గ్రామంలో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయములో వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామికి మంగళవారం ఉదయం నుండి పూజలు గురు స్వాములు దార మాదప్ప స్వామి,, వెంకటేష్ స్వామి, హనుమంతరాయ స్వామి రమేష్ స్వామి పెమ్మనహల్లి నాగరాజు, మద్దప్ప నాగరాజు, భక్తిశ్రద్ధలతో భజనలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామికి అభిషేకం, వివిధ రకాల పూజలు అర్చకులు గురు స్వాములు, నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పూలతో అలంకరణ చేశారు.. ఈ పూజా కార్యక్రమంలో మాల ధరించిన అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో భజనలు, కీర్తనలు పాడారు .. శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో అగ్నిగుండ%శీ% ఏర్పాటు చేశారు.అయ్యప్ప మాల ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం గురు స్వాముల ఆధ్వర్యంలో అగ్నిగుండ ప్రవేశం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కుబడును తీర్చుకున్నారు., శ్రీ అయ్యప్ప స్వామి భక్తి పాటలు వినడానికి వలస, విరప సముద్రం చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు తరలివచ్చారు. భక్తులకు మంగళహారతి,తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం నిర్వహించారు.



అయ్యప్ప స్వామి పూజల్లో పాల్గొన్న అయ్యప్ప భక్తులు





అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న అయ్యప్ప భక్తులు

## హరి నామ స్మరణతో మారుమ్రోగిన దేవాలయాలు

**రోళ్ల, డిసెంబర్ 30:**
మండల పరిధిలోని కొత్తపాళ్యం గ్రామంలో కొత్త తిరుపతిగా వెలుగొందుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం తోపాటు స్థానిక లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో మంగళవారం వేకువజాము నుండి ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో హరి నామ స్మరణతో ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఆలయంలో ప్రత్యేక హెూమాలు,పూజలు అలంకారాలుచేసి వేద పారాయణ%శీ% నిర్వహించారు, అనంతరం ఆలయ మాడవీధులలో ఉత్సవవిగ్రహాలను మేళతాళాలు,మంగళవాయిద్యాలతో వైభవంగా ఊరేగించి వైకుంఠ ద్వారదర్శనం ద్వారా భక్తాదులకు దర్శనం కలిగించారు. దేవాలయంలో

## ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారం లో ప్రవేశించి స్వామిని దర్శించుకుంటే కోటి పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా దేవాలయాల్లో స్వామివారికి వివిధ పూలమాలలతో దీపాలంకరణలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ప్రత్యేక పూజలో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఎస్ పి సతీష్ కుమార్..**

ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని కొత్తపాళ్యం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన ఉత్తర ద్వార దర్శనానికి మాజీ మంత్రి రఘువీరారెడ్డి, సత్యసాయి జిల్లా ఎస్ పి సతీష్ కుమార్ వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మినారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న, రాష్ట్ర ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, పాల్గొన్నారు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు గోవిందరాజు తోపాటు అర్చకులు వారిని మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని సన్మానించారు.

**భక్తులతో కిక్కిరిసిన దేవాలయం..**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా కొత్తపాళ్యం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్తర ద్వారాలో కొలువుదీరి కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు గోవిందరాజు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం లో ఎలాంటి సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ గౌతమి, గుడిబండ ఎస్ ఐ రాజా కుల్లాయప్ప, అగళి ఎస్ ఐ శోభారాణి,సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టారు.



శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ. దేవాలయంలో ఉత్తర ద్వారా దర్శనం చేస్తున్న భక్తులు. మాడవీధుల్లో శ్రీవారిని ఊరేగిస్తున్న దృశ్యం. ఆలయంలో అర్చన చేస్తున్న ఎస్ పి సతీష్ కుమార్ . ఎస్పి సతీష్ కుమార్‌ను సన్మానించి శ్రీవారి ప్రతిమను అందిస్తున్న ఆలయ ధర్మకర్త గోవిందరాజు దంపతులు. లక్ష్మి నరసింహా స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం చేస్తున్న భక్తులు

# చిరంజీవి కామెడీ టైమింగ్‌ని చూస్తారు

'మన శంకరవరప్రసాద్ గారు' పై అనిల్ రావిపూడిఈ సంక్రాంతికి రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ఆడియన్స్‌ను కచ్చితంగా అలరిస్తాడని దర్శకుడు అనిల్ రావిపూడి భరోసాగా ఉన్నారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి హీరోగా తెరకెక్కుతోన్న చిత్రమిది. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా మూడో పాటను రిలీజ్ చేయనున్నారు. గుంటూరులో ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో అనిల్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిలో ఉన్న కామెడీ టైమింగ్ మరోసారి తెరపై చూస్తారు. ఆయన ఈ చిత్రం కోసం ఎంతో శ్రమపడి లుక్ మార్చుకున్నారు. చూసినవారంతా చరణ్‌కు తమ్ముడా అని అడుగుతున్నారు. ఈ సినిమాకు ఆయన లుక్ అలా రావడం నా అదృష్టం. ఇండస్ట్రీకి చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణ, నాగార్జున నాలుగు మూలస్తంభాలు. వీరిలో ఏ ఇద్దరు కలిసి నటించినా అది గొప్పగా ఉంటుంది. 'మన శంకరవరప్రసాద్ గారు'లో వెంకటేశ్, చిరంజీవి కలిసి సందడి చేస్తారు' అని చెప్పారు. సంక్రాంతి అంటేనే సినిమాల పండగ. ఈసారి 'రాజాసాబ్'తో సందడి మొదలవుతుంది.

దానికోసం నేను కూడా ఎదురుచూస్తున్నా. వాళ్లు ప్రారంభించిన పండగ సందడిని మేం కొనసాగిస్తాం.

సినిమాను ఆదరించాలా, లేదా అనేది ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది. రివ్యూలు వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. వాళ్లను నేను ఎప్పుడూ తప్పు పట్టను. ప్రేక్షకులను అలరించడమే నా లక్ష్యం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇప్పుడు ఫ్యాన్ వార్‌లు సాధారణం అయ్యాయి. ఏ హీరో సినిమా విడుదలైనా అవి జరుగుతూనే ఉంటాయి. అందుకే ట్రోల్ చేస్తుంటారు. వాటికి మనం స్పందించకుండా ఉంటే బాగుంటుంది. ఒకప్పుడు మనం అందరి చిత్రాలను ఆదరించాం. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సోషల్ మీడియా వాడకం ఎక్కువయ్యాక ఈ ట్రోలింగ్ ఎక్కువైంది. పెద్ద హీరోల తర్వాతే మేము' అని అనడం ప్రభాస్ గొప్పతనానికి నిదర్శనం. అలా ఆలోచిస్తారు కాబట్టే ఆయన ఈరోజు పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. మేమందరం 'రాజాసాబ్'ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం.




# రోజూ వ్యాయామమే ఫిట్‌నెస్ రహస్యం



టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలు ఉన్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మధుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జునే. 66 ఏళ్ల వయసులోనూ ఫిట్‌గా కనిపిస్తూ యంగ్ హీరోలకు పోటీనిస్తుంటారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ సీక్రెట్ పంచుకున్నారు. తాను ఎప్పుడూ కడుపు మాడ్చుకొని డైటింగ్ చేయలేదు. వేళకు తింటాను. దానితో పాటు రోజూ కచ్చితంగా ఉదయం వ్యాయామం చేస్తాను. ఇప్పటికి 45 ఏళ్లుగా నేను జిమ్ చేస్తున్నాను. ఏరోజూ కూడా మిస్ అవలేదు. ఎప్పుడైనా ఆరోగ్యం బాలేక.. వెళ్లలేని పరిస్థితుల్లో ఉంటే తప్ప మిగతా రోజుల్లో కచ్చితంగా జిమ్‌కు వెళ్తా. అన్నిటికంటే ముఖ్యంగా నేను ఏ విషయాన్నైనా పాజిటివ్‌గా తీసుకుంటాను. ఎలాంటి సమస్య అయినా నన్ను నేను నిరుత్సాహపరుచుకోను అని చెప్పారు. ఇక 2025 గురించి నాగార్జున మాట్లాడుతూ తాను ఈ ఏడాది ఎంతో ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. కెరీర్ పరంగానే కాకుండా పర్సనల్‌గానూ చాలా సంతోషంగా ఉన్నానన్నారు. ఇంతకుమించి తానేం కోరుకోవడం లేదన్నారు. ఈ సంవత్సరం అఖిల్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారని.. అలాగే నాగచైతన్య- శోభిత ఒక్కటై ఏడాది పూర్తయిందన్నారు. వాళ్లను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాగార్జున కెరీర్ విషయానికొస్తే.. ఈ ఏడాదిలో ఆయన రెండు సినిమాల్లో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'కూలీ'లో ఆయన నటించిన సైమన్ పాత్రకు మంచి ఆదరణ సొంతమైంది. అలాగే కుబేరలో మాజీ సీబీఐ అధికారి దీపక్‌తేజ్‌గా కనిపించి మెప్పించారు. ప్రస్తుతం తన 100వ సినిమా పనుల్లో నాగార్జున బిజీగా ఉన్నారు. అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాగార్జున, ఆ తర్వాత తనకంటూ ప్రత్యేకమైన శైలితో స్టార్ హీరోగా ఎదిగారు. రొమాంటిక్ హీరోగా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, యాక్షన్, మాస్, భక్తిరస చిత్రాల వరకు అన్ని జానర్లలో నటిస్తూ ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో విజయాలను తన ఖాతాలో వేసుకున్న నాగ్ ఇప్పుడు తన కెరీర్‌లో అత్యంత కీలకమైన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. 'నా సామిరంగ' సినిమా తర్వాత వెంటనే 100వ సినిమా మొదలుపెట్టాల్సి ఉన్నా, ఇది మైలురాయి చిత్రం కావడంతో నాగార్జున ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కాస్త ఆలస్యం చేశారు. అయితే ఈ గ్యాప్‌లో ఆయన ఖాళీగా మాత్రం లేరు. ఇతర హీరోల సినిమాల్లో కీలక పాత్రలు, విలన్ రోల్స్ చేయడంతో పాటు బిగ్ బాస్ లాంటి షోలతో కూడా ఆడియన్స్‌కు ఎప్పటికప్పుడు దగ్గరగానే ఉన్నారు. ఇప్పుడు 100వ సినిమా విషయంలో పూర్తిగా ఎ÷-లాన్‌తో ముందుకు వెళ్తున్నారు. ఈ మైలురాయి చిత్రానికి కోలీవుడ్ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది.'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ కేరళలో జరగనున్నట్లు సమాచారం.

# రిద్ధి కి చీర బహూకరించిన ప్రభాస్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, రిద్ధి కుమార్ హీరోయిన్‌గా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్' పై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్లు, అప్‌డేట్స్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.ఈ క్రమంలో రీసెంట్‌గా హైదరాబాద్‌లో జరిగిన 'ది రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్లో హీరోయిన్ రిద్ధి కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కో హీరోయిన్లు మాళవిక మోహనన్, నిధి అగర్వాల్‌తో కలిసి సందడి చేసిన రిద్ధి, వేదికపై మాట్లాడుతూ తాను కట్టుకున్న చీరను ప్రభాస్ గిఫ్ట్‌గా ఇచ్చారని చెప్పడంతో ఒక్కసారిగా హాల్ మొత్తం ఈలలు, చప్పట్లతో మార్మోగిపోయింది. ఈ విషయం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో నెటిజన్లు తెగ చర్చించుకున్నారు. 'ప్రభాస్ భోజనాలే కాదు? చీరలు కూడా గిఫ్ట్ ఇస్తారా?', 'రిద్ధి అంత స్పెషల్ ఏంటి?' అంటూ సరదా కామెంట్లు పెట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో రిద్ధి కుమార్ ఆ చీర వెనుక ఉన్న కథను వివరించారు. రిద్ధి మాట్లాడుతూ? దీపావళి తర్వాత 'రాజా సాబ్' సెట్స్‌లో ఫస్ట్ టైమ్ అడుగుపెట్టాను. అది అక్టోబర్ 23. అదే రోజు ప్రభాస్ గారి బర్త్ డే. ఆయన అక్కడే ఉన్నారు. నేను ఆయనకు గిఫ్ట్ ఇవ్వాలని అనుకున్నాను. రెండు రోజుల తర్వాత దీపావళి పార్టీ జరిగింది. ఆ సమయంలో మారుతి సర్ 'ప్రభాస్ మీతో మాట్లాడతారు' అన్నారు. అలా తొలిసారి ఆయనతో ఫోన్‌లో మాట్లాడాను' అని తెలిపారు. ఆ కాల్ సమయంలో నేను ముంబైలో ఉన్నాను. బర్త్‌డే గిఫ్ట్ ఇవ్వాలనుకుంటున్నానని చెప్పాను. ఆయన ఓకే అన్నారు. అదే సమయంలో నాకు కూడా దీపావళి గిఫ్ట్ ఉందని చెప్పారు. సెట్స్‌కు వెళ్లేటప్పుడు నేను కర్ణుడి కథ ఆధారంగా శివాజీ సావంత్ రాసిన 'మృత్యుంజయ్' పుస్తకాన్ని గిఫ్ట్‌గా తీసుకెళ్లాను అని రిద్ధి వెల్లడించారు. కర్ణుడి నేచర్, ప్రభాస్ గారి నేచర్ చాలా సిమిలర్‌గా అనిపిస్తాయి. ప్రభాస్ అంటే రాజులాంటి వ్యక్తి. నేను బుక్ ఇచ్చినప్పుడు ఆయన సర్ప్రైజ్ అయ్యారు. ఆ తర్వాత 'కల్కి' సినిమా చూసినప్పుడు ఆ సింక్ నాకు ఇంకా బాగా అర్థమైంది. ఆ తర్వాత ప్రభాస్ గారు నాకు చీర గిఫ్ట్ ఇచ్చారు. అది చాలా లవ్లీగా ఉంది. మూడేళ్ల పాటు దాచిపెట్టుకున్నాను. ఇప్పుడు 'రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అదే చీర కట్టుకున్నాను' అని చెప్పుకొచ్చారు. అయితే రిద్ధి కుమార్ ? ప్రభాస్ ఫ్రెండ్‌షిప్ ఇప్పటిది కాదు. ఇప్పటికే 'రాధేశ్యామ్' సినిమాలో కలిసి నటించిన ఈ జంట, ఇప్పుడు 'ది రాజా సాబ్' లో మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు.



# సిద్ధూ జొన్నలగడ్డతో నాగవంశీ మరో మూవీ




టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డతో మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించింది. వీరి కాంబినేషన్‌లో 'ప్రొడక్షన్ నెం. 40'గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడింది. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత నిర్మాత సూర్యదేవర నాగవంశీ, సిద్ధు జొన్నలగడ్డ కలిసి పని చేస్తున్న సినిమా కావడంతో ఈ హ్యాట్రిక్ కాంబోపై ప్రేక్షకులు మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' చిత్రంతో తన ప్రతిభను నిరూపించుకున్న స్వరూప్ ఆర్ ఎస్ జే ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మార్క్ స్క్రీన్ ప్లేకి, సిద్ధు ఎనర్జీ తోడైతే సినిమా సరికొత్తగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే ఈ సినిమా టైటిల్ మరియు ఇతర నటీనటుల వివరాలను వెల్లడించనున్నారు. సిద్ధు ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ కంటెంట్ చాలా వైవిధ్యంగా ఉండబోతోందని సమాచారం.

# బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ మూవీపై చైనా అక్కసు




బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. ఇటీవల సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయగా.. ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ లభించింది. తెలంగాణకు చెందిన కర్నల్ బిక్కుమళ్ల సంతోష్‌బాబుతో పాటు 20 మంది మన సైనికులు వీరమరణం పొందారు. ఇదే ఈ కథకు మూలంగా తెలుస్తోంది. అయితే, దీనిపై తాజాగా చైనా అధికారిక మీడియా 'గ్లోబల్ టైమ్స్' అక్కసు వెళ్లగక్కింది. చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ నోరుపారేసుకుంది. ఈ మేరకు తమ సంపాదకీయంలో భారత సినిమాపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ చిత్రం జాతీయవాద మెలోడ్రామా అని చైనా ఆరోపించింది. గల్వాన్‌లో ఘర్షణలకు భారత బలగాలే కారణమంటూ తమ దేశాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేసింది. భారత దళాలు అక్రమంగా తమ భూభాగంలోకి చొరబడి.. చైనా సైనికులపై దాడి చేశాయంటూ అసత్యాలు వల్లెవేసింది. తమ దేశానికి చెడ్డపేరు తెచ్చేందుకు భారత్ వాస్తవాలను వక్రీకరించి అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించిందంటూ బూటకపు వ్యాఖ్యలు చేసింది. చైనా సార్వభౌమ భూభాగాన్ని రక్షించుకోవాలనే మా సైన్యం దృఢ సంకల్పాన్ని ఈ చిత్రం కదిలించలేదు అంటూ చైనా సైనిక నిపుణుడు సాంగ్ జాంగ్‌పింగ్ వ్యాఖ్యలను ఈ కథనంలో గ్లోబల్ టైమ్స్ ప్రస్తావించింది. ఐదేళ్ల క్రితం 2020 జూన్‌లో భారత్-చైనా సరిహద్దుల్లోని గల్వాన్ ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. భారత జవాన్లపై చైనా సైన్యం మెరుపుదాడికి దిగడంతో మన దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ వీరోచిత పోరాటంలో తెలంగాణకు చెందిన కర్నల్ బిక్కుమళ్ల సంతోష్‌బాబుతో పాటు 20 మంది మన సైనికులు వీరమరణం పొందారు. చైనా వైపు కూడా ప్రాణనష్టం ఉన్నప్పటికీ.. దానిపై బీజింగ్ స్పష్టతనివ్వలేదు. ఈ ఘర్షణలను ఆధారంగా చేసుకునే 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో సల్మాన్ ఖాన్.. కర్నల్ సంతోష్‌బాబుగా నటిస్తున్నట్లు సమాచారం.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Munturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.